# గుళికలు

- గల్పికలు

## రమానాథ్ కందాళ



శ్రీ

కౌముది

మీ మునిగోళ్లలో సాహితీ వెన్నెల

www.koumudi.net

ప్రచురణ సంఖ్య: 14



# గుళికలు
## రమానాథ్ కందాళ



**గుళికల గురించి**

| | |
|---|---|
| *కుదురు రోగము:* | *అపూర్వ ప్రయోగములైనందున అనిర్ధారితము.* |
| *పదార్థములు - పాళ్ళు:* | *మీకు తెలిసిన మాకు తెలియచేయ మనవి* |
| *వాడకము:* | *నెలకో గుళిక* |
| *వాడుక సూచన:* | *గొంతునకడ్డము పడకుండ మింగవలెను.* |
| *హెచ్చరిక:* | *వికటించవచ్చు. వ్యసనలోలత కి అవకాశమున్నది.* |

## ఆత్మకథ

ఇది జరిగి కొన్నాళ్ళైంది. నేనిప్పుడు చెప్ప బోయేవి తన స్వయానా నాతో అన్న మాటలు. కల్పన అవసరం లేదు. అవసరం లేని కల్పన అందం చెడగొడుతుంది. తనకీ నాకూ పూర్వ పరిచయం పెద్దగా ఏం లేదు. అవసరార్థం ఆ రాత్రి కలవాల్సి వచ్చింది. నేను వెళ్ళేసరికి తను సిద్ధంగా ఉంది.

"ఏడీ రాముడు? లోపలున్నాడా?" అన్నాను.

"నిద్ర పోతున్నాడు". వాడి ప్రసక్తి కూడా తనకి ఇష్టం లేనట్టుంది.

లోపలనుంచి చిన్నగా గురక వినిపిస్తోంది. తను ఆ శబ్దం భరించలేనట్టు "ఇక నేను వెళ్ళాలి" అంది.

తను ఆ రాత్రి వాణ్ణి వదిలి వెళిపోతోంది.

"సరే" అన్నాను.

తను వెళ్ళబోతూ నా వైపోసారి చూసి "జాగ్రత్త" అంది.

"సరే"

"కాదు.. నిజంగా జాగ్రత్త. వీడితో కత్తిమీద సాము."

ఉత్తి జాగ్రత్తేమో అనుకున్నాను కానీ ప్రత్యేక హెచ్చరికలా ఉంది. అపరిచితుల్ని కూడా హెచ్చరిస్తున్నామంటే ఆపద ఘనమైంది కావాలి.

"ఏం?" అన్నాను.

"వీడిదో దయ్యాల కొంప"

"దయ్యాలా.. నీకెలా తెలుసు?" దయ్యాలుండడం కన్నా అవి ఉన్నట్టు తనకెలా తెలిసిందో అన్న దాని మీద నాకు కుతూహలం కలిగింది.

"దయ్యాలంటే దయ్యాలు కాదు .. దయ్యాల్లాంటివి"

నా ప్రశ్న తనకెక్కినట్టులేదు. దయ్యాలే కానక్కర్లేదు, భూత ప్రేత పిశాచ శాఖినీ ఢాకినీ శాఖల్లో తను దేన్నుదహరించినా కూడా నా ప్రశ్న అలానే ఉండీది. తన జవాబూ అలానే ఉండీదేమో.

"ఆ దయ్యాలాడించినట్టల్లా ఆడ్డం, పైగా మాంత్రికుళ్ళా తనే వశపరుచుకోని వాటినాటాడిస్తున్నట్టు నాతో వాదించడం"

"ఎప్పణ్ణుంచి ఇదంతా?" అన్నాను.

"తనకి జ్ఞానం తెలిసిన దగ్గర్నుంచని తనంటాడు. ఉన్న జ్ఞానం పోయిన దగ్గర్నుంచని నేనంటాను. అటువంటి జ్ఞానం పోయినా పరవాలేదని తనంటాడు."

నాకర్థవైంది వాళ్ళ అన్యోన్యత. చెడ్డదంటే చెడదూ మరి. ఎడ్డెం అంటే తెడ్డెం అనే కాపురం చెడకపోతే చెప్పుకోవాలి. తను చెప్పుకుపోతోంది.

"ఉండాల్సిందే అటువంటి జ్ఞానం అని నేనేనంటాను. తనొప్పుకోడు. ఎవరు చెప్పారేం? ఎవడో చెట్టుకింద కళ్ళుమూసుకుని కన్నదల్లా జ్ఞానవే, మనకది ఉండాల్సిందే అంటే నాకు ఒప్పుకోబుద్ధికాదు అని రెట్టిస్తాడు."

విడిపోతున్నారంటే ఏదో సంసారపు గొడవలనుకున్నాను. కానట్టుంది. సంసారంలో రగడకి అంతా ఎరిగున్న కారణాలు వేరు. జ్ఞానం లాటి అజ్ఞాత కారణం ఇదే మొదటిసారిగా వినడం. ఆమాటే అంటే తను,

"ఒక్క జ్ఞానవేనేవిటి.. తప్పూ, ఒప్పూ, నీతీ, నియమం, ధర్మం, ఆచరణా, అరిషడ్వర్గాలూ, అపవర్గం, దేవుడూ, మతవూ, వీటిల్లో వేటి మీదా ఖచ్చితం లేదు మనిషికి. వట్టి అనుమానప్పురుగు. ఆమాటకేవన్నాడో తెలుసా.. ఆ! నువ్వెక్కళ్ళే .. గాల్లో ఓ గీత కొట్టేసి ఇటు వైపుది చెడ్డగాలి, అటువైపుది మంచిగాలి అని విభజన చేయగలవు, చెయ్యాపి చెడ్డగాల్ని గుప్పిట్లో చిక్కించుకోగలవు, నీకా సూత్రాలన్నీ రాసిపెట్టున్నాయి, అన్వయానికీ అనుమానంలేదు, అమలుకీ అనుమానంలేదు. నా అనుమానానికి సర్వ బాధ్యతలూ నావే. దాని పాలనా పోషణా నివృత్తీ అన్నీ నావే. నీ పిచ్చులు నువ్వు దేవుడికంటకడతావు... నా అనుమానం వల్ల బాగుపడింది లేకపోతే పోయె.. కానీ నీ పిచ్చులు కార్చిచ్చుల్లా వ్యాపించి తాకిందల్లా తగలేసిందనడానికి లక్ష ఉదాహరణలు.. నేననుమానప్పురుగునైతే నువ్వో ఖచ్చితప్పిచ్చిముండవి అన్నాడు చెప్పుతో కొట్టినట్టు."

*సారాంశం..*

ఇహ పరాలకి సంబంధించినదేదవనీండి.. వాటిల్లో ప్రతీ దానిమీద తనకేమో బిగువు సడలని సూత్రాలున్నాయ్. వాట్ని నోరెత్తకుండా పాటించాలంటుంది. అనుమానప్పొడ గిట్టదు. భగవానువాచ, పాటించుము తప్పక తు.చ. అంటుంది. కావులిస్తే ఉవాచలన్నీ ఉన్నపళంగా వల్లించి చెపుతుంది. కాదన్డానికి కంఠం పెగ్గిలాదు మామూలు వాడికైతే. కానీ వాడు మామూలు వాడు కాట్ట. తనింకా చెప్పుకుపోతోంది.

"ఇంతకుముందోసారి గట్టిగా నిలదీసి నా పద్ధతులంటే నీకెందుకింత ద్వేషం అన్నాను. ద్వేషవా?.. ఎందుకూ ద్వేషం.. ద్వేషానిక్కూడా నిశ్శంక కావాలి. అనుమానవున్నవాడు ద్వేషించలేడు: అని గీతలో కృష్ణుళ్ళా నవ్వేడు. ఏం చెయ్యాలి?"

నిప్పు తొక్కిన కోతిలా తను గెంతిన కొద్దీ వాడు నిమ్మకు నీరెత్తినట్టుంటాట్ట. తను శిశుపాలుళ్ళా రెచ్చిన కొద్దీ వాడు వక్కలు లెక్కిస్తూన్న కృష్ణుళ్ళా కూచుంటాట్ట. కంఠశోషొచ్చి తను కింద పడిపోవలసిందే కానీ వక్కలు బస్తాల కొద్దీ తెప్పించుకుని మరీ

లెక్కపెట్టగలట్ట. లెక్క మానడు, చక్రం వొదలడు. సమస్య కాదూ. నాకు జాలి వేసింది. "పోనీ.. బతిమాలో.. ఏదో చేసి.." నేనింకా పూర్తి చెయ్యలేదు.

"అదీ అయింది.. ఎన్ని సార్లు గెడ్డం పట్టుకోలేదు. బాబ్బాబని బతిమాలేను. లక్షల కోట్ల మంది నడిచేరు, నడుస్తున్నారు నేనంటూన్న మార్గంలో, నువ్వు కూడా నడవరాదూ.. అంటే ఏవన్నాడో తెలుసా?.. నువ్వు చెప్పిందివింటే నీవంటూన్న మార్గం మహరద్దీగా కనబడుతోంది. ముందువాడి వీపు తప్ప మరోటి కనిపించదు, అదీ కళ్ళు విప్పితే. వాడు వెళ్ళివెళ్ళి గోతిలో పడితే వెనకాడ్డానిక్కూడా కుదరదు. ఎందుకంటే ఈలోపుల నీ వెనకవాడు నిన్ను తోసుకుంటూ వొచ్చేస్తాడు. ఇద్దరూ కలిసి గోతిలో పడతారు, అన్నాడు . ఇంకేం చెప్పాలీ మనిషికి?"

అవును ఏం చెప్పాలి? ఒక్కోసారి నోరు మెదులుతుంది కానీ ఏం చెప్పడానికీ ఉండదు. అయినా చెప్తాం. మన నమ్మకాల మీద మనకున్న విశ్వాసం అటువంటిది. అది బుద్ధికీ వాక్కు కీ ఉన్న లంకెని శాసిస్తుంది. తనది మహామహులు మలచిన బాట అన్నదిట. మరోబాట మలిచి వాడు మహామహుడు కాబోడం తనకి అసూయా అనడిగేట్ట. అహంకారపడకు అన్నదిట. అధైర్యపడకు అన్నాట్ట. తనది నలిగినబాట అన్నదిట. ఎవరూ నడవకపోతే ఎలా నలుగుతుందీ అన్నాట్ట. ఇలా వాగ్ద్వంద్వయుద్ధం జరిగి జరిగి చివరకి తను, 'ఇది దేవుడు చెప్పిన మార్గం, దీని చివర దైవసాన్నిధ్యం లభిస్తుంది', అన్నదిట.

ఆమాటకి వాడోక్షణం ఊరుకుంటే తన్మాత్రపడింది, తగలాల్సినచోట తగిలుంటుంది, ఇంకేం పెగుల్తుందిలే అని. వాడు తాపీగా, 'చెప్పేవు కాదేం .. నిక్కర్ల రోజుల్నుంచీ నీ ప్రకారం నిషిద్ధప్పనులు చేస్తున్నవాణ్ణి. దేవుడి చరిత్రని చూస్తే నాలాటివాళ్ళ కోసం ప్రత్యేక మార్గం వేసుకుని తనొచ్చినట్టే ఉంది తప్ప నేను తనకోసం పోయినట్టు లేదు, నాకోసం తనే వస్తాళ్ళే. నేను పోవడం ఎందుకు? ' అన్నాట్ట.

"మేవిద్దరం భేదించని విషయంవంటూ ఉంటే కనక అదున్నట్టు మేం ఎరక్క పోబట్టేను. నిత్యం భేదిస్తూ కూడా కలిసుండగలగడం కత్తిమీద సాము లాటిది. తెగే వరకేను. ఆ తెగడం తెగడం వాడలా అనడంతో కసుక్కున తెగింది. ఈ మొండి వెధవతోనా నేనిన్నాళ్ళూ జత కలిపింది?.. రాడూ మరి దేవుడు?.. స్థంభాలు పగలగొట్టుకుని మళ్ళీమళ్ళీ వస్తాడు... మంచీ, చెడ్డా, భయం, భక్తీ వీడి మొహాన గోళ్ళతో సందేహం లేకుండా గీకి మరీ పోతాడు. వీడితో జత ఇక దుస్సహం. అందుకే వదిలి పోతున్నాను." అంది తను.

అవసరాన్ని బట్టి అవతారం. అదే కద ఉవాచగా రాసున్నది. ఇంతకీ నాకెందుకు. తను వెళ్ళిపోతాననంటే ఆపడానికి నేనెవర్ని? తను వెళ్ళడానికి ఆయత్తమవుతూ "వస్తాను. జాగ్రత్త! అన్నట్టు నీ పేరూ.. గుర్తుకు రావట్లేదు.." అంది. పని సందట్లో పేర్ల సంగతి ప్రస్తావనకి రాలేదు.

"నా పేరా.. నా పేరు సంశయాత్మ అంటారు" అన్నాను.

"సంశయాత్మా?.... వీడికి తగ్గ జతవే. సంశయాత్మా వినశ్యతి.. మీ కర్మ" అంది ఖచ్చితాత్మ పైకెగిరిపోతూ.

ఖచ్చితాత్మకేం బెంగ లేదు. ఇవాళా రేపూ తనకి కావలసిన రాముళ్ళు కోకొల్లలు. క్షణంలో తనకి మరో జత దొరుకుతుంది. సంశయాత్మల బతుకే మరీ తాడూ బొంగరం లేకుండా ఉంది. నేను నిశ్శబ్దంగా లోపలికెళ్ళి చూసేను. రాముడు మత్తుగా ఏదో పలవరించి ఓ సారి పక్కకి ఒత్తిగిలి పడుకున్నాడు. చడీ చప్పుడూ లేకుండా నేను వాళ్ళో దూరేను. మర్నాడు వాడు నిద్రలేచి ఒళ్ళు విరుచుకుంటూ ఈ మధ్యకాలంలో ఇంత సుఖనిద్ర పోలేదు, ఇట్టే తెల్లారింది అనుకున్నట్టు గుర్తు.

# జల సంభవుడు

అనగా అనగా ఒక ఊరు. ఆ ఊళ్ళో ఒక చిన్న చెరువు. ఆ వేళ చెరువులోపల ఏదో జాతర జరుగుతున్నట్టు కోలాహలంగా ఉంది. రకరకాల రంగురంగుల చేపలు గుమిగూడుతూ అంతలోనే చెదిరిపోతున్నాయి. ఒకచోట నిలవలేకపోతున్నాయి. విడిపోతున్నాయి. కలుస్తున్నాయి. ముందుకుపోయినట్టే పోయి తక్కున వెనక్కి తిరిగొస్తున్నాయి.

ఈ సందడికి కారణం కొద్దిసేపట్లో జరగబోయే మత్స్య మహాసభ. సభంటే సందడే మరి. పూజకి మంత్రంలా సభకి సందడి ప్రధాన సంజ్ఞ.

కొద్దిసేపటికి ఓ చేపకొటి ముందుకొచ్చి సభ ప్రారంభమవుతోందని ప్రకటించింది. దాని పేరు జలసంభవుడు. అది చేపల నాయకుడు. ప్రకటన వినగానే సభిక చేపలు అప్రమత్తమయ్యేయి.

ఓసారి సభని కలియచూసి జలసంభవుడిలా అన్నది.

"నా ఎరికన ఇటువంటి సభ అడపాదడపా తప్ప జరగలేదు. కొన్నాళ్ళ కిందట మన చెరువులో జలాభావ పరిస్థితులొచ్చినప్పుడొకసారి, అప్పుడెప్పుడో మరెందుకో మరోసారి జరిగేయి. సరిగ్గా గుర్తులేదు. విషయవేవిటంటే దేవుడు మనిషి గానూ మరోటి గానూ రాకముందు సృష్ట్యాదిలో చేపై వచ్చేడని పెద్దలు చెపుతారు.".

దేవుడి ప్రసక్తి కి సభలో సెగ రేగింది.

"ఆ వచ్చింది వేదోద్ధరణకా చేపోద్ధరణకా? " అందో చేప నిష్టూరంగా

"దేవుడు చేపవడం వల్ల చేపలకేం ఒరింగింది? " అంది మరో చేప

"తన పుస్తకాలు కూడా తను కాపాడుకోలేని వాణ్ణి సృష్టికర్త చెయ్యడంలోనే తెలియడంలేదూ తెలివంతా!" అని మరోటి,

"ఒకనాడు దేవుడు చేపయ్యేడు.. అంచేత కొంగలూ కొంగలూ ఇవాళ మమ్మల్ని తినకండేం అంటే ఏకొంగ మానుతుందేం?" అని ఇంకోటి.

ఇలా సెగ రగిలి భగ్గుమనబోయింది.

జలసంభవుడు కలగచేసుకుని "శాంతించండి. నిజవే.. కొంగ ధర్మం చేపకి న్యాయం కాదు. అంతవరకెందుకు? మన్లో మన మాట. సొరచేప ధర్మం చిరుచేపకి న్యాయంగా తోస్తుందా? దానికి దేవుడు చేసేదేదన్నా ఉందనుకుంటే మీ ఇష్టం. విషయవేవిటంటే అవయవశూన్యాలైన సూక్ష్మతమజీవులు ముందు ఎన్నున్నప్పటికీ స్థూలంగా చెప్పాలంటే ఇప్పటికి సృష్టి పరిణామంలో చేప మొదటిది. మనిషి కడపటి వాడు" అన్నది.

మనిషి అన్న మాట వినబడగానే సభలో మళ్ళీ భగ్గుమంది.

"కొంగా గింగా అనుకానీ మనిషి మాటెత్తద్దు"

"కొంగలకి ధర్మవున్నదేమో కానీ .. మనిషి పాటించేది ధర్మవా? ..ఛీ"

"ఎరలూ వలలూ కొంగలు వెయ్యవు.. మహా అయితే ముక్కుకో చేప.. మనిషి వట్టి ఆశపోతు"

"వాడు సృష్టి పరిణామం కాదు. సృష్టికి వ్రణం."

ఇలా రకరకాల నిందావాక్యాలు వినబడ్డాయి. ఎండుజిల్లేడుకాయలో రసంలా దేవుడి మీదా మనిషి మీదా సానుభూతి బొత్తిగా మృగ్యమైంది సభలో.

అన్నీ విని జలసంభవుడు శాంతంగా "మీ మాటల్లో సబబు లేదనడానికి నా అనుభవం ఒప్పదు. కానీ మనిషితో కలుపుకుని మనవంతా ఒకే సృష్టి సంతానం. సంతానంలో కనిష్టుడి బాధ్యత ఒక్కోసారి ప్రథముడు వహించాల్సి వస్తుంది. వాడి అవసరాలు తీర్చాల్సి రావడంతో పాటు మంచీచెడూ చెప్పాల్సి వస్తుంది. అటువంటి అవసరం ఇప్పుడొకటి ఆసన్నమైంది" అంది.

చేపలు మొహ మొహాలు చూసుకున్నాయి. మనిషికి బుద్ధిగరపడవంటే అసాధారణ క్రియ. అందులోనూ చేపలకి. వేటాడి తినేవాడి ఎదట కోరిపడి ఏ సూక్తులు వచించగలం? సహజవైరి సహవాసం అసంభవమని జలసంభవుడెరగడా? కాకపోతే జలసంభవుడు నమ్మకమైన పాలకుడు, అనుభవజ్ఞుడు, అసత్యవాది కాడు. చెప్పనీ చూద్దాం అన్నట్టూరుకున్నాయి చేపలు.

జలసంభవుడు చెప్పుకు పోయింది.

"ఆహార నిద్రా భయ మైథునాలలో మనకీ మన కనిష్టుడికీ పెద్దగా తేడా లేదు. మనని వాణ్ణుంచి వేరు చేసేది బుద్ధి అని వాడి నమ్మకం. కానివ్వండి. ఎవడి కన్ను వాడికి ప్రమాణం. దానికి తగవెందుకు. కాని రాను రాను మనిషి బుద్ధి గడ్డి తింటోంది. వెర్రితలలు వేస్తోంది. తన అవసరాలు తీరుస్తున్న సహజీవులని లెక్కా పద్దూ లేకుండా మనిషి విధ్వంసం చేస్తున్నాడు. సహజీవనానికి ప్రాథమిక సూత్రం సంతులనమని ఎరగకుండా ఉన్నాడు. వాడు వేస్తున్న వలల్లో పడి మనవాళ్ళు వేలకు వేలు మాయమవుతున్నారు. మత్స్యజాతి మనుగడ చిక్కులో పడ్డది. ఈ ఊపున కొల్లగొట్టుకుంటూ పోతే మనకీ బతుకుండదు, తనకీ ఎంతో కాలం గడవదు. విచక్షణ పాటించమని, పరిధెరిగి మసలుకొమ్మని అది మీరితే ఉభయత్రా బాగా జరగదని మనం తనకి నచ్చజెప్ప వలసున్నది." అన్నది.

అందులో హితవుంది. బెదిరింపు లేదు. బెదిరించి సాధించే కార్యాల్లో ఏ మాత్రం గుణం ఉంటుంది? పైగా ఇది బెదిరించి సాధించదగ్గ కార్యం కాదని కుడా తను ఎరుగును.

సభలో నిశ్శబ్దం పేరుకుంది. పిల్లి మెళ్ళో గంట సంగతి తెలుసు కనక జలసంభవుడు నిరుత్సాహ పడలేదు. ఓ సారి తల పంకించి "జాగ్రత్తగా వినండి. ఈ చెరువున్న ఊరికి రాజు ధీశాలి, వివేకి, భూతదయాపరుడు, దూరాలోచన గలవాడు. తన పరిపాలనలో ఇటువంటి అతిక్రమణ జరుగుతోందని తెలిసి ఉపేక్షించే వ్యక్తి కాడు. హద్దులమలు పరచగల శక్తి గలవాడు. విహారార్థమై తను ఈ చెరువు వైపు రేపుదయం రానున్నట్టు కబురు తెలిసింది. మనం కొంతమంది తన ఎదటపడి పరిస్థితి మనవి చేద్దాం" అన్నది.

చేపలకి పాలు పోలేదు. చెయ్యచ్చు. కానీ రాజులకి వచ్చే బుద్ధీ పొయ్యే బుద్ధీను. అంతలోనే కరుణ.. అంతలోనే కన్నెర. రాచమంతనం మాటలు కాదు. తల తెగిపోతుంది. ఇంతెందుకు. మనిషి గురించిన మొరేదో దేవుడితో పెట్టుకుంటే..కానీ.. దేవుడైనా ఏం లాభం? మనిషికి గుండె ఒక్కటే రాయనుకుంటే దేవుడికి ఒళ్ళంతా రాయే. రాతి అవతారపు దేవుడికి చలనవా చచ్చు బండలా. తూలనాడే వాళ్ళు ఆడుతూనే ఉన్నారు, మాలలేసే వాళ్ళ వేస్తూనే ఉన్నారు. ఓమాటా, మంతా? ఇలా పరిపరివిధాల కాసేపు పోయేయి.

చివరకి జలసంభవుడి మీద నమ్మకం కొద్దో, మనిషి మీద మంట కొద్దో, దేవుడి మీద నిస్పృహ కొద్దో తటపటాయించినా సరే అన్నాయి.

ఆ తర్వాత ఏంజరిగిందీ అనేది లోక విదితం.

మర్నాడుదయం అనుకున్నట్టుగా రాజుగారు విహారానికి రాలేదు. ఆయన ఏడుగురు కొడుకులూ మటుకూ వచ్చేరు. విహారానికి కాదు, వేటకి. వేటకొచ్చి జలసంభవుడితో సహా ఏడు చేపలని వేటాడి తీసుకుపోయేరు. ఏడు చేపల్నీ ఎండబెట్టేరు. వాటిల్లో జలసంభవుడు ఎండలేదు. ఏవని అడిగితే నోరు తెరిచి అతి కష్టమ్మీద బుద్ధీ, గడ్డీ అని ఏదేదో పలవరింతగా అంది. పోవాల్సిన ప్రాణమే. కర్తవ్యదీక్ష కాసేపుణ్ణిచ్చింది. రాజుగారి కొడుకులు గడ్డి విన్నారు కానీ బుద్ధి వినలేదు. అంచేత పక్కనే ఉన్న గడ్డివామునీ, ఆవునీ, అమ్మనీ, పిల్లాణ్ణీ ,అలా అలా చివరకి చీమనీ అడుక్కుంటూ పోయేరు. అడిగిందే తడవుగా గడుసు చీమ చెప్పుచ్చుకు కొట్టినట్టు రాజుగారి

కొడుకుల్ని ఓ సమాధాన ప్రశ్న వేసి జలసంభవుడి కార్యం తను తీర్చింది. ఆ సమాధానప్రశ్నతో మనిషికి బుద్ధొచ్చిందా అంటే రావాలనే కాదూ మరి ఏ ప్రయత్నమైనాను?.

# నాలిక - పేగు

వాడా?.. వాడి గురించి చెప్పాలంటే లక్షుంది.

ఇంత లక్షనీ కట్టెన్, కొట్టెన్, తెచ్చెన్‌లా చెప్పాలంటే చెప్పుకోచ్చు. కానీ అందులో ఏవుంటుందోయ్ మజా?

ఇప్పుడు నీకెవడన్నా ఓ కొబ్బరుండలాటిదిచ్చేడనుకో, కొంగ చేపని మింగినట్టు గభీమని గొంతులో పడేసుకోని మింగేవు కద. నాలిక మీద నాట్యమాడించి, ఆడించి మరీ తింటావు కానీ.

ఎంత రుచిగ్రహణ పారీణుడికైనా కడుపులోకెళిపోయింతర్వాత ఇంకేవి రుచోయ్? కడుపులో ఏవుంది, చిన్నా పెద్దా పేగుల్తప్ప? దేవుడి కడుపుమటుకూ ఎక్సెప్షననుకో. అండపిండ అవేవో సంహతులనెల్ల గుప్తగతి బొజ్జలో అన్నారు దేవుడికొచ్చేసరికి. అదలా ఉణ్నీ!

మానవ మాత్రుల విషయంలో మటుకూ ఉండాల్సిందంతా నాలిక మీదుందంటాను. అందుకే కదటోయ్ 'రసనే' పిబరే రామరసం అన్నారు కానీ 'పేగే' పిబరే రామరసం అనలేదు కద. పేగు సంస్కృతం కాదనుకో.. తెలిసి చచ్చిందెవడికిలే.. అయినా పేక్కీ నాలిక్కీ సామ్యవా చెప్పు?

ఇంతకీ వాణ్ణి గురించి కదూ మనవనుకుంటూన్నది. ఏవిటలా మొహంపెట్టేవ్? అర్జెంటుగా వెళ్ళాలా? పనుందా? ఎందుకుండదోయ్.. అసలు పనంటేనే 'ఉండేది' అని అర్ధం. ఉండకపోతే అది పనే కాదు. అంచేత దాన్నలా ఉణ్నీ. పైగా నువ్వెళ్ళకపోయినంత మాత్రాన నీపని ఇంకోడితో లేచిపోతుందా ఏవిటి? శకుంతల్లా కాచుకోనుంటుంది. మనం దుష్యంతుళ్ళం, మన పన్లు శకుంతలలు అనుకో. వాట్ని వీలైనంత మరచిపోవాలి.

ఇంతకీ ఏవిటి.. మీ చెల్లి కులాసావేనా.. అమెరికాలోనే కదూ ఉంటున్నది. బావగారు మైక్రోసాఫ్టేనా.. కాదా.. సన్నా.. అవనీ. అది కాకపోతే ఇది. మన పెద్దచెరువుకి దక్షిణాన నలభైయ్యేకరాల మావిడితోట ఎవరో అమెరికా వాళ్ళే కొన్నారని విన్నాను. మీ బావేనేవిటి? అవ్వచ్చా.. అదేం సమాధానవోయ్? హనుమంతుడి ముందటోయ్ కుప్పిగంతులు?.. రామదాసుకుటోయ్ రాగం? త్యాగరాజుకుటోయ్ తాళం? చూడు.. మనవాడభివృద్ధిలోకొస్తున్నాడంటే మనక్కాదటోయ్ ఇది. రానీ..ఒక్కడి అభివృద్ధి పదిమందికి ఉపకరించేలా ఉంటే...ఏవంటావు.. నిజంగా వెళ్ళాలా .. అబ్బ.. వెళ్లువుగానిలేవోయ్.

ఇంతకీ ఏవిటి.. మీ తమ్ముడు కులాసావేనా? ఉత్తరాలవీ రాస్తున్నాడా? ఏవంటావ్.. మొన్నే ఈమెయిలిచ్చేడా. సెల్లు కూడా కొట్టేడా.. చూసేవా మరి, నేనింకా పావురాళ్ళ యుగంలో పడున్నాను.

బస్సో రైలో ఎక్కించిన్తరవాత అది కదుల్తూంటే దాన్తో పాటు పరిగెడుతూ 'వెళ్ళగానే ఓ కార్డుముక్క రాసిపడే' అని కిటికీ లోంచి వాగ్దానం తీసుకోకపోతే వీడ్కోలు చెప్పినట్టుండేదే కాదు. అక్కణ్ణుంచి ఆ కార్డుముక్క కోసం కళ్ళల్లో వత్తులు. రోజూ పోస్ట్‌మేన్ని వేధించుకు

తినీడం. వాడిక్కోపవొచ్చి మన కార్డుముక్క కాస్తా సందవతల చెత్తకుండీలో విసిరీసి వెళిపోతాడేమోనని శంక. ఎంత టెన్షననీసి. అడక్కిహ. నువ్వడగలేదంటావా.. బలే వాడివోయ్.. అడగాల్టోయ్ మరీను? నువ్వడగనంత మాత్రాన నా అనుభవం అనుభవం కాకపోతుందా? అదలా ఉణ్ణీ.

ఇంతకీ ఉత్తరం రాయడవుంది చూసేవూ.. అందులోనూ కార్డుముక్క.. అదో బ్రహ్మవిద్య. అదో మహాకళ. కాదన్నవాడి కళానిర్వచనంతో నాకు పన్లేదు. ఇంతకీ అది విద్యా? కళా అంటావా? అను. విద్యలో నైపుణ్యావూ దాని ప్రదర్శనా కళే కదటోయ్.

విషయవేవిటంటే.. మావాడోడుండీవాళ్ళే... వర్థి అణాపరక ముండాకొడుకు. మహా కక్కుర్తి. రాయాల్సిన లక్ష విషయాలూ ఎడ్రసుకైనా జాగా లేకుండా మొత్తం ఓ కార్డుముక్క మీద గొలికీసేవాడు. భూతద్దం పెట్టి చదువుకోవాల్సొచ్చేది. పచ్చకార్డు కాస్తా ఇంకులో ముంచెత్తినట్టు నల్లకార్డయిపోయాది. డేటు కూడా వేసేవాడు కాదు, జాగా వేస్టనీసి. పోస్టుముద్ర క్కూడా జాగా ఉండేది కాదు. పాపం పోస్టలువాడు వెతుక్కోని వెతుక్కోని ఓ చోట రేఖా మాత్రంగా ముద్ర వేసేవాడు. ఉత్తరం అందిన రెండోరోజుకి మావాడు చేతిలో సంచీతో దిగీసేవాడు "అదేవిటీ.. కార్డుముక్క రాసేనే.. అందలేదా?" అంటూ. బానే ఉందికానీ ప్రతీ ఉత్తరాన్నీ భూతద్దాలు పెట్టి చదువుకోగలవా చెప్పు? అదలా ఉణ్ణీ.

ఇంకోడుండేవాడు.. వాడూ కార్డు బాపతే. కానేమో విచక్షణలేని మహాభక్తుడు. వీడి భక్తిని కనక శంకిస్తే దేవుడిక్కూడా కళ్ళు పోతాయన్నట్టుండేది. జై మూకాంబికా మాతా అనికానీ, బరంపురం బాబాయైన్నమహ: అనికానీ ఇప్పటిదాకా వెలిసిన, లేక ఇంకా ఇప్పుడిప్పుడే ప్రచారపు మొగ్గ తొడుగుతూ పూర్తిగా వెలవని దేవుడు, దేవత, స్వామి, బాబా, మాతల పేరు.. ఏదో ఒకటి.. తాటికాయలంత అక్షరాలతో స్కేలు పెట్టి కొలుచుకున్నట్టు సరిగ్గా కార్డు మధ్యలో రాసేవాడు. దానికే సగం జాగా అయిపోయాది. అది రాసిన్తరవాతే ఏ మానవమాత్రుల క్షేమమైనాను. అంతే కద! మరి మనం ఇరుక్కు చచ్చినా దేవుడికి మటుకూ జాగా ఉంచద్దూ.

అయినా, భక్తంటూ ఉండాలే కానీ దాన్ని ఒకలాగే తీర్చుకోవాలనేవుందోయ్? దోసిలొగ్గి తీర్చుకోచ్చు, దొర్లి తీర్చుకోచ్చు, మొక్కి తీర్చుకోచ్చు, మోసి తీర్చుకోచ్చు, పొగిడి తీర్చుకోచ్చు, పాడుచుకు తీర్చుకోచ్చు, తిట్టి తీర్చుకోచ్చు. తిట్లభక్తేవిటా అంటావా నిందాస్తుతి అంటే మరేవిటనుకున్నావ్? భక్తిలో ఉండే సౌలభ్యం అలాటిది. అదో చిత్తప్రవృత్తి ధర్మం. మానసిక సంస్కారం. అది నిన్నెలా ప్రకోపింపచేసేదీ, పురికొల్పేదీ దాని వల్ల నువ్వు పొందిన సంస్కారాన్ని బట్టి ఉంటుంది. వీడు రాసి తీర్చుకున్నాడు. అంతేను. అదలా ఉణ్ణీ. కాకపోతే విషయవేవిటంటే వీడు మహాభక్తుడే కాక బహు మర్యాదస్థుడవబట్టీ కూడా వాళ్ళు బావున్నారా, వీళ్ళు బావున్నారా అని సకల జగజ్జనక్షేమవూ రాసుకుంటూ, అడుక్కుంటూ పోయి విషయం ఎంతకీ తెవిల్చేవాడు కాదు. చివరలో ఎక్కడో తనొస్తున్నట్టు రాసేవాడేమో మరి.. అందాకా చదివితే కద.. వీడూ రెండోరోజుకి చేతిలో సంచీతో తయారు "అదేవిటీ ..రాసేనే.. అందలేదా" అనుకుంటూ. రాస్తే సరిటోయ్... అవతలి వాడు చదవద్దూ.

ఇంకోవెధవున్నాడు. "ఏం బావా.. నేనూ.. జగ్గమ్మత్త కొడుకుని. కులాసావా.. అదేవిటీ.. అందలేదా" అనుకుంటూ దిగిపోయి ఒకసారి రెండ్రోజులున్నాడు. ఏవిటీ అందేది? వాడేవన్నా రాస్తే కద. దొంగ వెధవ! మూడో రోజు తెల్లారేసరికి మరి కనబళ్ళేదు. వాడితో పాటూ ఇంట్లో వెండిసామాను కూడా కనబళ్ళేదు. అప్పటిక్కానీ మా జగ్గమ్మత్తకి కొడుకుల్లేరన్న విషయం తట్టలేదు. వాడెప్పుడైతే బావా అంటూ శంకార్హమైన సంబోధన చేసేడో అప్పుడే అనుమానించవలసింది. చివరికి పలాసలో పట్టుబడ్డాడు. అదలా ఉణ్ణీ.

విషయవేవిటంటే క్షేమం నుంచీ సెలవు దాకా పస చెడకుండా, నస లేకుండా, పొల్లు పోకుండా, మేర మీరకుండా, ఆరితేరిన దర్జీవాడు – స్వహస్తాల్తో ఇరుకూ వదులూ కాకుండా కొలిచి కుట్టిన చొక్కాలా రాయడానికి నేర్పు, అభ్యాసవూ, క్రమశిక్షణా ఎన్నో కావద్దటోయ్? కార్డురాతకటువంటి నైపుణ్యం కావాలి. దాని సైజలాటిది. ఎలా పట్టిస్తావో పట్టించు చూస్తాను అన్నట్టుంటుంది.

విషయవేవిటంటే.. ఇదిగో.. కార్డవనీ, కవరవనీ.. ఉత్తరం రాయడం, దాన్నందుకుని చదువుకోడం లాటి అనుభవాలున్నాయ్ చూసేవ్.. మరుగున పడిపోతున్నాయోయ్ క్రమేణా. కొన్నాళ్ళకి దస్తూరి అంటే ఏదన్నా స్వీటు పేరేమో అనుకుంటారు. మిక్స్చర్ తో పాటూ పావుకిలో దస్తూరీ కట్టివ్వమంటారు.

నాటకాన్ని సినీమా, రేడియోని టీవీ, పాటని డాన్సూ, నడకని పరుగూ మింగేసినట్టు ఉత్తరాన్ని ఈమెయిళ్ళు, సెల్లులు మింగేసేయి. మా అప్పుడైతే మాస్టారూ పోస్ట్ అనొక్క కేక వినబడ్డదంటే.. చూసేవ్.. మధ్యందిన మార్తాండుడు మాడు పగలగొడుతున్నా "నాదంబొక్కటి పిక్కటిల్లె దిశలన్ నవ్యామృతావ్యాహతాస్వాదంబై" అన్నట్టుండేది. ఏవిటిలా పొయిటిక్కపోతున్నాననుకోకు. అవ్వాల్సిందే మరి. ఆయొక్క అనుభవం అలాటిది, మరా పొయిట్రీ అలాటిది. నల్లమబ్బునీ పిల్లగాలినీ ఒకచోట చేర్చి కురవద్దంటే మానుతుందోయ్ వానజల్లు?

ఏవంటావూ?. నాదంబంటే ఏవిటా?.. అదేవిటోయ్ మరీను.. నాదంబూ నీదంబూ నీ ముక్కూ నా ముక్కూలా అనుకున్నావా?.. నాదమోయ్..నాయనా నాదం..శ్రవణపేయమైన శబ్ద తరంగం! విరవాల్సిన చోట విరవకపోతే విరిగి నెత్తిమీద పడుతుంది! నీ తప్పేవుందిలే.. మీ సంతతే అంత. రామునితోక వ్యవహారం. అదలా ఉణ్ణీ !

ఇంతకీ మీ అక్క కులాసావేనా.. లండనేనా.. కాదు కాదు ..దుబాయ్ కదూ.. కాదా.. మస్కటా.. అవనీ.. మస్కట్టనీసరికి గుర్తొచ్చింది.. మన బహమనీ సుల్తానుల్లేరూ.. వాళ్ళ ముత్తాతలక్కణ్ణిం..ఏవిటీ.. అర్జెంటా.. వెళ్డువుగాన్లే.. ఒక్క నిమిషం.. విషయవేవిటంటే.. అన్నట్టు ఏవిటీ విషయం.. ఆ.. అదీ.. అనుభవాలోయ్.. అనుభవాలు.. ప్చ్.. ఎక్స్టింక్టయిపోతున్నాయ్. అవని గర్భంలో రాకాసిబల్లుల ఆనవాళ్ళు నిక్షిప్తవైపోయినట్టు కొన్నాళ్ళకి శాస్త్రప్రకారం తవ్వి చూసుకోవాల్సొస్తుంది. కానీలే.. తప్పదు. తలుచుకుంటే మటుకూ పేగు మెలి పెట్టినట్టుంటుంది. వెధవపేగు. దాన్లో ఇది అది మెలితిరిగితే కాని తెలీదు. నాలికదేవుంది..నానా రుచులకీ ఊడిగం చేయిస్తుంది. నానా వాగుడూ వాగిస్తుంది. అప్పడం తిన్నా అరిసెలు తిన్నా అరిగించుకోవాల్సింది పేగే కదోయ్? అంచేత నువ్వేవను గాక, స్టఫ్ఫంతా ఉన్నది అసలు పేగులోనే. వెళ్ళిరా మరి. ఇదిగో.. నల్లపూసైపోకు సుమా. అప్పుడప్పుడుకనిపిస్తూండు. అరిగిపోవులే.

# దైవజాతకుడు

"చల్లకొచ్చి ముంత దాచడం ఎందుకు? చూపించు చూపించు"

తను చెయ్యి చాచేడు.

"ఆ చెయ్యి కాదు. ఈ చెయ్యి"

గుప్పిలి మూసుకునుంది. కొద్దిగా వణుకుతోంది.

"అలా మూస్తే ఎలా? బలే వాడివే.. తెరు తెరు"

వణుకు ఎక్కువైంది. గుప్పిలి మరింత బిగుసుకుంది.

"ఇదిగో చూడూ.. పుట్టిన్నాటి జాతకం ఎలాగూ లేదంటున్నావ్. ఆ మాట కొస్తే ఎప్పుడు పుట్టిందీ తెలీదంటున్నావ్.. ఇంకా రెట్టిస్తే అసలు నేను పుట్టే లేదనేట్టున్నావ్.. ఎలామరి? ఉన్నదల్లా నీ చెయ్యీ, దాన్లో గీతలూనూ.. నేను చెప్పగలిచేదేదైనా ఉంటే చెయ్యిచూసి చెప్ప గలి గేదే కానీ చూడకుండా కాదు. ఏదీ..కాస్త చూణ్ణీ"

చెయ్యి నెమ్మదిగా తెరుచుకుంది. ఆరోగ్యంగా ఉంది. రేఖలు స్ఫుటంగా కనిపిస్తున్నాయ్. ఇంతవరకూ బిగపట్టి ఉండడం వల్లనేమో ఎర్రటి చాయలు అక్కడా అక్కడా కనబడుతున్నాయ్. వణుకు మాత్రం అలాగే ఉంది.

"ఆహా.. ఏవి చెయ్యి.. ఏవి చెయ్యి.. ఇది పాణా పద్మవా.. ఇలాటి చెయ్యి మరొహనాడు, మరొహడికి చూసెరగను. రాజాలాటి చెయ్యి. అసలిలాటి చెయ్యున్నవాడు చూపించుకోనే అక్కర్లేదు, గొప్పకి తప్ప! నీ మొహం చూస్తే నీకా వాంఛ లేనట్టుంది. ఏవిటి విషయం?"

చెప్పబోయేడు.

"ఉండుండు.. విషయవేదో నువ్వే చెప్పేస్తే నా ఘనతేవుంది? ఎంత అమాయకుడివోయ్.. నన్ను చెప్పుకోనీ.. ఆహా..చూపు తిప్పబుద్ధి కావడం లేదు సుమా. చూసినకొద్దీ చూడాలనిపిస్తోంది. సుమసమలాలిత్యం .. నొక్కి చూతునా.. అరె..బలే పటిష్టంగా ఉందే. సౌకుమార్యం, దార్ఢ్యం.. దేనికదే అవునా? ఆగాగు.. చెప్పకు.. నన్ను చెప్పుకోనీ.. అవును, ముమ్మాటికీ అవును. కాదని నా కళ్ళతో నేననలేను"

తను చెయ్యి వెనక్కి లాక్కున్నాడు.

"అదేవిటి..నిప్పు తాకినట్టు వెనక్కి లాగేసుకున్నావ్. నేనేవన్నా అశుభం పలికేనా, అసత్యవాడేనా? చెయ్యి చూసేను, కనబడ్డది చెప్పేను. ముద్రలు, రేఖలూ, సంకేతాలు సుస్పష్టంగా గోచరిస్తూంటే .. కనబడ్డది కాదంటావటోయ్.? ఏదీ ఇలా తే .. చూదాం."

తను చెయ్యి సగం అందించేడు. మిగతాది బలవంతంగా లాక్కోబడింది.

"నువ్వెందుకు సందేహిస్తున్నావో కానీ, ఇదిప్పటిదా?ఎప్పటిదోను. అతి ప్రాచీనం. కాదనడానికీ, ప్రశ్నించడానికీ మన తెలివి చాలదు. అసలిది తెలివితేటలకి లొంగీ వ్యవహారవా? వత్తి కల్ల. అసలీ దివ్యజ్ఞానవనేది ప్రాకృత దృష్టికి గోచరిస్తుందా?.. అప్రాకృత దృష్టి కావాలి. దివ్యచక్షువుక్కానీ గోచరించని విజ్ఞానం దిక్కుమాలిన తెలివితేటలకందుతుందా? దీన్లెక్క ప్రకారం నీ చెయ్యి నిజాన్ని నిలువెత్తు మూర్తిని చేసి నీ ముందు నిలబెడుతుంది. ఏమొహం పెట్టుకుని కాదంటాం? అయినాకానీ మొహానిదేవుంది? ఏ పూతన్నా పూసుకుంటుంది. ఏ ముసుగన్నా వేసుకుంటుంది. చెయ్యికలా కాదే. మొహానికందని భావాలు చేతిలో పలుకుతాయి. తత్కారణాత్.. సందేహించకు.. చూణ్ణీ..

ఆహా.. ఏవి చెయ్యి.. ఎత్తులూ, పల్లాలూ ఎంత సహజంగా ఇవిడిపోయేయ్. ఇహ రేఖలంటావా. ఆరితేరిన గీతగాడు కొలిచి గీసినట్టున్నాయి. చీలాల్సినచోట చీలుతూ, కలవాల్సినచోట కలుస్తూ, ఆయుష్షు, కీర్తి, సంతానం, సౌభాగ్యం, పదవి, పరపతి.. ఒహటేవిటి.. దేని పౌష్కల్యం చూసినా సంభ్రమజనకంగా ఉంది. నీకు రాజయోగం తప్ప మరోటి రాసున్నట్టు కనబట్టం లేదు. నీ ఆయుర్దాయం అనంతం. యశస్సు అనశ్వరం. సర్వ వ్యాప్తమవుతుంది. దిగంతాలు తడుతుంది. మరి నీశక్తి అనన్యం. దానికి లొంగనిది ఉండదు.

అంతెందుకు.. ఇదిగో చూడు.. ఈ ఒక్క రేఖనీ చూడు. జెర్రిగొడ్డులా.. ఇదొక్కటి చాలు. నీ చేత తోసి రాజనిపిస్తుంది. ప్రపంచాన్నేలిస్తుంది. ఒక్క ప్రపంచవేవిటి.. సకల చరాచరాత్మక విశ్వసమస్తాన్నీ నీ అధీనం చేయిస్తుంది. నీ గుప్పిట్లో పెడుతుంది. నువ్వు ఊ అంటే విశ్వం కదుల్తుంది. కాదంటే మాన్తుంది. అసలననే అక్కర్లేదు. తలపు చాలు. తక్షణం అమలవుతుంది. నీకు తిరుగుండదు..."

అతని మొహం వికసించలేదు. చెయ్యి ఇంకా వణుకుతూనే ఉంది. అతను ఆశించినది వినబడినట్టు లేదు.


"దైవ జాతకుళ్ళా ఉన్నావ్.. ఎవరు నాయనా నువ్వు? నీ చేతికీ మొహానికీ పొంతన లేదే? నీ చేతిని బట్టి నీ మొహం ధగద్ధగాయమానంగా వెలిగిపోవాలి. కళ తరిగి ఉందేం?"

తను నోరు విప్పి ఏదో అనబోయేడు. పెదవి వణికింది. మాట రాలేదు. మొహం నిస్తేజమై ఉంది. కళ్ళ వెంట ధారాపాతంగా నీళ్ళు కారుతున్నయ్.

"..అదేవిటి అలా దు:ఖిస్తున్నావ్?. ఇలాటి చెయ్యి ఉన్నవాడు అలా బేల కావడానికి వీల్లేదే. ఏదో లొసుగుంది.. ఏదీ సరిగా చూణ్నీ.. ఈ రేఖల ప్రకారం.. మరి అణిమాద్యష్టసిద్ధులూ, స్థైర్య ధైర్య శౌర్య పరాక్రమాలూ,.. అన్నట్టు.. ఆగాగు.. ఈ రెండు రేఖలూ.. ఎక్కడ దాక్కున్నాయ్ ఇంత వరకూ..చూళ్ళేదు సుమా. చర్మచక్షువు మందగించినట్టుంది. జెర్రిగొడ్లన్నానే.. అది పోలిక కోసమే కానీ రేఖలు జరజరా పాక్కు పోతాయా ఏం? కళ్ళు నులువుకుని చూస్తే కనబడక ఎక్కడికి పోతాయ్.?..

ఈ రేఖల ప్రకారం.. ఆహా.. ఈ చెయ్యి కరవాలమూ పట్టగలదు కరుణా చూపగలదు; అరిభంజనమూ చేయగలదు అభయమూ ఇవ్వగలదు. నీ శక్తికెలాగైతే అంతులేదో నీదయకీ అంతులేదు. నువ్వు ఆపత్సఖుడవు, అర్థి కల్పకుడవు, నీ పేరు కోరి చాటుతారు.. ఎందుకంటే అది తలిస్తే చాలు.. ఇహ నేను చెప్పాల్సిన అవసరం లేదు.. ఆర్తులు సకల భయ పీడా రోగాది వర్జితు.."

మాట పూర్తి కాలేదు. అతనికి దు:ఖం కట్టెలు తెంచుకుంది. మహావేదనతో బరువెక్కిన మనసుకి ఒక్కసారి చిల్లు పడ్డట్టు చేతుల్లో మొహం దాచుకుని భోరుమన్నాడు. ఏదో చెప్పబోతున్నాడు. మాట స్పష్టత లేదు. దు:ఖాతిశయంతో వెక్కుతున్నాడు. కొంచెం శ్రద్ధగా వింటే మాత్రం వినబడుతుంది, తన దయకి తగ్గ శక్తి తనకి లేదని అతనంటూన్నట్టు. అతనంటే సరేనేవిటి? అతని చెయ్యి ఒప్పుకోద్దూ ఆమాటని? రాజాలాటి చెయ్యా మరోటా?



# వేపచెట్టు

ఆ చెట్టు కింద సందడిగా ఉంది.

ఊడలు పట్టుకుని ఊగుతూ పిల్లలు నానా అల్లరీ చేస్తున్నారు. మానుచుట్టూ పరిగెడుతూ ఆటలాడుతున్నారు. ఊడల సాయంతో కొమ్మలమీదకి కోతుల్లా ఎక్కుతున్నారు. దబ్బున కిందకి దూకుతున్నారు. అదే పని ఎన్నిసార్లు చేసినా తనివి తీరుతున్నట్టు లేదు. చేసినపనే చేసుకుంటూ ఆనందించడం పిల్లలకి చేతనయినట్టు మరొకరికి కాదు. ఓ పిల్లాడు పట్టు తప్పి అంతెత్తు నుంచీ ధన్నున కింద పడ్డాడు. గెడ్డం చీలుకుపోయి బోలెడు రక్తం కారింది. అయినా వాడేం ఏడవలేదు. పెద్దయ్యేక కూడా వాడికది గుర్తుంటుంది. వాడేం చేస్తాడు? ఆచెట్టు వాణ్ణలా పురికొల్పింది మరి! అంతేసి పెద్ద పెద్ద ఊడలూ అదీ.. ఎవడికూగాల్నుండదూ?

ఆ చెట్టు కింద ఏదో గొడవవుతోంది.

ఒకణ్ణెవణ్ణో చెట్టుకి కట్టేసి కొడుతున్నారు. వాడేం చేసేడో మరి. ఎవరో ఆడమనిషి పక్కనుంచీ అడ్డుకుంటూ వొదిలీమని నెత్తీనోరూ బాదుకుంటోంది. వీధిన్యాయానికి తగ్గ విచారణ జరిగే ఉంటుంది. శిక్ష అమలవుతోంది. అంతా నిలబడి చూస్తున్నారు. చెట్టు అందరినీ చూస్తోంది. శిక్షయ్యేక అంతా ఎవరి దార్న వాళ్ళు పోయేరు. ఆడమనిషి వాడికి కట్లు విప్పి నీళ్ళు తాగించింది.

ఆ చెట్టు మీద గడబిడగాఉంది.

ఎక్కడెక్కణ్ణుంచొచ్చేయో సాయంకాలానికి..బోలెడు పక్షులు.. చెట్టు మీద వాలి బోలెడు కబుర్లు చెప్పి, గుబురాకుల్లో వెచ్చగా సర్దుకున్నాయి. రాత్రైంది. గాలి ఊసు లేదు. చెట్టు నిశ్చలంగా భేతాళ కథల పుట్టిల్లులా ఉంది. నిద్రలో పట్టు తప్పిందేమో ఏదో పక్షి కింద పడబోయి రెక్కలు టపాటపా కొట్టుకుంది. మిగతా పక్షులు కొన్ని లేచి రెక్కలాడించి హడావుడి చేసేయి. నిమిషంలో అంతా సర్దుకుంది. ఇదంతా మామూలే అన్నట్టు రాత్రి తనమానాన తను గడిచింది.

ఆ చెట్టు కింద బస్సాగింది.

ఎవరి అమ్మమ్మో సంచీతో బస్సు దిగింది. కట్టొదిలిన దూడల్లా మనవలు దూకుతూ పోయి అమ్మమ్మని వాటేసుకున్నారు. ముద్దుల వర్షం కురిసింది. పలకరింపులెవడిక్కావాలి? పెద్దసంచీ ఎందుకు తేలేదు, ఎక్కువరోజులుండవా? అని మనవలు గద్దిస్తున్నారు. మనవలు గద్దించినా కూడా అమ్మమ్మకి ముద్దే. మరిన్ని ముద్దులు పెట్టుకుంది. గబగబా గాలొచ్చి చెట్టాకుల్ని గలగల లాడించింది.

ఆ చెట్టు కిందే స్వాముల వారికి బస.

చల్లగా ఉంది, ఇక్కడే బస ఏర్పాటు చేసుకుంటాం అన్నారు. కానీమన్నారు ఊరిపెద్దలు. వార్త పాక్కింది. పాక్కకపోతే అనుకోవాలి. ఓహ్.. తీర్థంలా ప్రజ. క్యూలో నిలబడి ఎండలెక్క లేకుండా తోసుకున్నారు. విబూది పొట్లాలు పావలాకొకటి చొప్పున అమ్మేరు. స్వాములవారి ఫోటో చిన్నది రెండు రూపాయిలు, పెద్దది మూడున్నర. వేడి పకోడీల్లా చెల్లేయి. ఏదన్నా వేడిగా ఉన్నప్పుడే కద. స్వాముల వారు చెట్టు మొదట్లో నీడన కూచున్నారు. భక్తులు వీలైనంత మందికి చెట్టు నీడ పరిచింది.

ఆ చెట్టు కింద డేరా వేసేరు.

పండగొచ్చింది. డేరాలో దేవుడి బొమ్మ పెట్టేరు. చెట్టుకి పసుపు కుంకుమలు పెట్టి, కొమ్మలకి రంగు కాగితాల తోరణాలు కట్టేరు. రాత్రయాసరికి ఆరీ వెలిగే లైట్లు పెట్టేరు. చెట్టు మానుకి అటూ ఇటూ లౌడు స్పీకర్లు కట్టి వాతాపీ, దినకరా వేసేరు. ఊరందరికీ అవి

వినబడ్డాయి. పూజారొచ్చి యామీ, నమహాలు మాత్రమే వినబడేట్టు మంత్రాలు చదివేడు. స్పెషలు దర్శనం కోసం ప్రెసిడెంటు గారొచ్చేరు. కూతురి చేత కుంకుమార్చన చేయించేరు. పండగన్నన్నాళ్ళూ చెట్టు పెళ్ళికూతుర్లా కళ కట్టింది.

ఆ చెట్టుకి చీమ కుట్టినట్టు లేదు, అవేళొచ్చిన గాలివానకి.

మహామహా 'వటష్మాజాలే' పటాపంచలైపోయేయ్. చెట్టు చలించలేదు. గాలి బలే పెనుగులాడింది. వానని తోడు తెచ్చుకుంది. ఇటుంచటూ,అటుంచిటూ గాలీ, వానా శతవిధాల పోరేయి. తగ్గేయి, హెచ్చేయి, తగ్గుతున్నట్టే తగ్గి ఒక్కసారి విర్చుకు పడ్డాయి. ఏ విత్తు సత్తువో కానీ చివరకి చెట్టు గెలిచింది. నిబ్బరంగా నిలిచింది.

ఆ చెట్టుకింద ఒక టాటాసూమో ఆగింది.

నలుగురో అయిదుగురో దిగేరు. ఏవో కాయితాలు తీసేరు.. ఈశాన్యమ్మూల.. అటు పదిగజాలు.. ఇటు పాతిక..అని ముక్కలు ముక్కలుగా మాట్లాడుకున్నారు. చెట్టూ, దానిని ఆనుకునున్న ఖాళీ జాగా, అటువైపు పొలం.. అన్నీ కొలుచుకున్నారు. ఓ గంట పట్టింది. అయితేనేం కొలతలు కుదిరేయి. టాటాసుమో వెళిపోతున్నప్పుడు రేపిన దుమ్ములో చెట్టు మసకైంది.

ఇంకొన్నాళ్ళకి..

ఆ చెట్టుకింద ఏ గొడవాలేదు. ఇంకా కిందేవిటి, అసలు చెట్టే లేకపోతే. తోటలకి తోటలే ప్లాట్లయిపోతూంటే ఈ వెర్రిచెట్టొక్కొటీ వెలగబెట్టేదేవుంది? దీనికేవన్నా కొమ్ములు మొలిచేయా? ప్రభంజనాల్నీ అశనిపాతాల్నీ ఆపిందేమో కానీ రంపపుకోతని ఆపడానికి ఇదేవన్నా పెట్టిపుట్టిందా? కాకపోతే కాస్త ముందే తెలిసుంటే బావుణ్ణు. వాటేసుకుని బావురుమందును. అమ్మమ్మ ఊరెళిపోతూ ఉంటే మనవలు అలాగే ఏడ్చేరు వాటేసుకుని వదలకుండా. మనవలకి కనబళ్ళేదు కానీ అమ్మమ్మ కూడా ఏడ్చింది.

❀❀❀

# భక్తిమంతుడు

సుబ్బులక్ష్మి విష్ణుసహస్రనామం సీడీ కార్లో ఉందికాబట్టి ఏదో వాదోడు గా ఉంటుంది.. డ్రైవింగ్‌చేస్తూ లాగించీయచ్చు. అది లేకుండా మటుకు తగుదునమ్మా అని పరధ్యాన్నంగా జ్ఞాపకమ్మీద మొదలెట్టేవనుకో.. ఇన్ఫినిట్ లూపులో చిక్కుకుంటావు.. రెండు మూడు శ్లోకాలున్నాయి.. వైకుంఠపాళీలో పాముల్లాగ.. అమాంతం మింగీసి మొదలెట్టిన చోట కంటే రెండు గళ్ళు వెనక్కి తీసుకొచ్చి పడేస్తాయి. గ్లోబులో మోటారుసైకిల్లాగ తిరుగుతూనే ఉంటావు కానీ ఎక్కడికీ పోవు. నామాలు వెయ్యే.. కానీ ఎంతకీ తెవల్దు. నాలిక పీకుతుంది. పెదిమెలు పొడి కడతాయ్. గొంతెండి పోతుంది. విశ్వరూపం కనబడుతుంది. శోషొచ్చి పడిపోతావేమో అన్నట్టయిపోయి చివరకి కాయేనవాచా అని గబగబా గొణీగీయాల్సి వొస్తుంది. అంచేత ఒళ్ళుదగ్గరపెట్టుకుని చదవాలి. కళ్ళుమూసుకోక్కల్లేదు. మూసుకోకూడదు కూడాను. డ్రైవింగు చేస్తూ కళ్ళు మూసుకోకూడదు. ప్రాణాలు నిలబెట్టే ప్రాథమిక సూత్రం. కరెక్టుగా చదివితే ఆఫీసు దగ్గర లెఫ్ట్ కొట్టేవేళకి హాయిగా గంట కొట్టినట్టు 'ఇతి శ్రీమహాభారతే' వొచ్చెస్తుంది.. దణ్ణవూ, దణ్ణంతో పాటు డాష్‌బోర్డు మీద దేవుణ్ణి ముట్టుకుని ముద్దూ.. ఇదంతా మామూలుగా జరిగిపోవాలి.. కానీ ఇవేళ ఈ ముష్టి ట్రాఫిక్కు.. అన్ని లేన్లలోనూ కార్లే.. ఒక దాన్నొకటి చిన్నచిన్న తోపులు తోసుకుంటూ.. ఏ వెధవో ఎక్కడో ఎవణ్ణో గుద్దీసుంటాడు ముందర.. ఒళ్ళ పొగరు. నిర్లక్ష్యం.. వెధవలు.. చేతిలో చక్రం ఉంది కదా అని ఇష్టవొచ్చినట్టు తిప్పుతారు. కుర్రవెధవలైతే మరీను. ఒళ్ళూ పై తెలీదు. అయినా వాళ్ళనెందుకులే అనుకోడం.. వాళ్ళ అమ్మలనీ నాన్నలనీ పట్టుకుని దులిపీయాలి. గుద్దేస్తే గుద్దీసేడు.. కాకపోతే ఇవాళే గుద్దీయాలా.. స్వామీ ఏవిటీ పరీక్ష?.. ఇవాళ నాకెంత ముఖ్యమైన

దినవో సర్వజ్ఞుడివి నీకు తెలియదా. సరిగ్గ ఎనిమిది గంటలకి ఆఫీసులో ఉండాలే. నా పెర్ఫార్మెన్స్ ఇవాల్యుయేషన్‌కి నేనే లేటయితే ఎలా? బాసెంత చండశాశనుడో బాసాణాం బాసువి, నీకు తెలీదా. అసలే ఇండియన్ బాసు. తెలుగువాడు కూడాను. మన కీళ్ళూ నాళ్ళూ క్షుణ్ణంగా ఎరిగినవాడు.. తెల్లబాసైతే 'ఇవాళ కోడి కుయ్యలేదు సార్.. సారీ .. లేచేసరికి లేటయిపోయింది' అన్నా 'దట్సోకే..దట్సోకే..ఐ హోప్ యువర్ కోడీ ఈజ్ ఓకే..' అనగల సహృదయులు. మిష్టర్ రావ్ మటుకూ అలా కాదు. 'మై వైఫీజ్ గోయింగ్ త్రూ లేబర్..'అంటే 'థేంక్ గాడ్ ఇట్స్ యువర్ వైఫ్, నాట్ యు. ప్లీజ్ లాగిన్ ఫ్రం డెలివెరీ రూం' అన్నా అనగలడు. కాకపోతే భక్తుడేను. మొన్న గుళ్ళో కనబళ్ళేదూ, చూణ్ణట్టు నటించేడు కానీ. అసలింతకీ ముందేవైందో కనబడకుండా ఉంది. పేరుకుపోయిన కార్లనీ చూస్తుంటే గూడ్సుబళ్ళు కబుర్లు చెప్పుకుంటూ నత్త నడకలు నడుస్తూన్నట్టుంది. స్వామీ! సిగ్నలు ఇవ్వునాయనా.. సకల చరచర జగతిని సంకల్పమాత్రంతో నడిపించగలవే. ఈ వెధవ కార్లని ఒక్క తోపు తోయలేవా. 'అఖిలహేయ ప్రత్యనీక కల్యాణైకతాన స్వేతర సమస్త వస్తు విలక్షణానంత జ్ఞానానందైక స్వరూపా' అని ముకుళిత హస్తాలతో నీ ముందు నిలిచి అర్థంకాని భాషలో ఎన్నిసార్లు వల్లించలేదు?.. ప్రయత్నం చేస్తే ఎందుకర్థంకాదూ అంటావా.. ఏ ప్రయత్నవైనా నీ అనుగ్రహం వల్ల దానంతటది జరగాలికానీ నేను చేసేదేవుంది స్వామీ? పైగా ప్రగాఢ నమ్మకం ముఖ్యంకానీ ప్రతిపదార్థ తాత్పర్యాలెందుకు? నీకు తెలీకనా..? ఏదో నన్ను వెర్రి వాణ్ణి చేసి గడుసు వాడివి కాబట్టి అలా ప్రశ్నలు వేస్తావు.. నీకు గుర్తుందా.. అలనాడు మద్రాసులో వీసా ఆఫీసు క్యూలో సెకెండ్ షో నుంచి సరాసరి వెళ్ళి నిలబడి, ప్రవేశం లభిస్తుందో లేదో అని పడిగాపులు పడుతూన్న నన్ను..నీ అనుగ్రహ ధారాఖ్య వనధికి పాత్రుణ్ణి చేసి.. ఎలాగో అలా ప్రవేశం లభింపజేసి.. వీసా దొరికింప జేసి.. టిక్కెట్టు కొనిపింపజేసి.. విమానవెక్కింపజేసి.. వినువీధుల విహరింపజేసి.. ఇదిగో ఇలా.. ఇక్కడ పడేసేవు. కాళ్ళక్యూలోంచి కార్లక్యూ లోకి. అంతా నీ దయ! నీ కటాక్షం! అసలు నీ కృపావీక్షణం నా మీద ఒకానొక క్షణంలో ప్రసరించింది అని చెప్పుకుంటే కళ్ళు పోతాయి. ఎల్లప్పుడూ నీ దయాపూర్ణ దృక్కులు నా మీద అవిశ్రాంతంగా ప్రసరిస్తూనే ఉన్నాయి. గుర్తుందా?..గ్రీన్‌కార్డప్పుడు మాత్రం.. నిన్ను నేనొదిలిపెట్టేనా.. నన్ను నువ్వొదిలిపెట్టేవా. డేట్లు కరంటవక నా మనసు తూట్లు పడుతూంటే నీ గుడి గోడకో ఇటుక సమర్పించుకుంటే అంతా సవ్యంగా జరిగిపోలేదూ. సిటిజెన్ షిప్పప్పుడో.. ఫింగరు ప్రింట్లకి పిలుపెంతకీ రాకపోతే, స్వామీ త్వమేవ అని నీకు సతీసమేతంగా సాష్టాంగపళ్ళేదూ.. పడ్డవాళ్ళందరికీ పన్లు అవుతున్నాయా.. నామీద నీకెందుకో ఇది. పలుసార్లనుకుంటే జింక్స్ కొట్టెస్తుంది. నువ్వు జింక్సాపగల సమర్థుడివేకానీ.. అయినా ఎందుకు నీకా శ్రమ? నా జాగ్రత్త నేను పడితే పోదూ. ఇంతవరకూ అన్నీ నీ దయ వల్ల సవ్యంగా జరిగేయి.. ఈ పెర్ఫార్మెన్స్ ఇవేల్యుయేషన్ కూడా సరిగ్గా జరిగిపోతే. నిన్నే రెస్టరూములోంచి మిష్టర్ రావ్ ఒస్తూంటే, నీ అనుగ్రహం వల్ల నాకూ అదేసమయానికి లఘుశంక కలగడం, నేను వెళ్ళడం, తలుపు దగ్గర ఎక్స్యూజ్ మీ అంటే ఎక్స్యూజ్ మీ అనుకోడం, నేను తలుపు బార్లా తీసి పట్టుకుంటే తను ఓ థాంక్యూ అనడం.. అంటూ నా వైపు చూసినవ్వడం.. సంశయం నాస్తి..ఇంత వరకూ అన్ని సంకేతాలూ సవ్యంగా ఉన్నాయి.. ఇదంతా నీ అనుగ్రహవే. ఈ దుర్మార్గపు ట్రాఫిక్కెలాగూ కదిలేలా లేదు. సైడు రోడ్డు తీసుకుంటాలే.. కానీ నాయనా! స్వామీ! ఆశ్రితమందారా! ఏదో ఒకటి చేసి మిష్టర్ రావునెలాగైనా లేట్ చేయించు తండ్రీ! చేయించేవనుకో....

✡✡✡✡

'హోప్ యూవ్ నాట్ బీన్ వైటింగ్ లాంగ్'

'నో మిష్టర్ రావ్..నాటెటాల్..'

'సారీ ఫర్ దీ డిలే.. ఐ హేడ్ ఎ స్మాల్ ఫెండర్ బెండర్ కమింగ్ టు వర్క్ .. నథింగ్ మేజర్..'

'ఐ యాం సారీ టు హియర్ దట్ మిష్టర్ రావ్.. హౌ డిడ్ ఇట్ హేపెన్.. ఇఫ్ ఐ మే ఆస్క్'

'ఓ.. నథింగ్..నథింగ్.. టూబీ ఆనెస్ట్.. ఐ హేడ్ థిస్ థింగ్.. థిస్ సీడీ ఆఫ్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మీస్ విష్ణుసహస్రనామం.. పార్వత్యువాచా దగ్గర పారవశ్యం పట్టలేక కళ్ళు మూసుకున్నాను.. యూనోహౌఇటీజ్.. తెరిచేసరికి ఫెండర్ బెండరయిపోయింది.. దట్స్ దీ డిలే..'

✡✡✡✡

అంతా వాడి లీల కాక మరోటని ఏ మొహం పెట్టుకుని అనను?!

✡✡✡✡

## పొడుగమ్మాయీ వాళ్ళ నాన్న

ఆ అమ్మాయిది లంక వీధి. మొట్టమొదటి సారి మా పరిచయం ఎలా జరిగిందో ఇప్పటికింకా నాకు మెదడు మీద వాతపెట్టినట్టు గుర్తుండిపోయింది. నేను కిటికీలోంచి తనని చూస్తున్నట్టు తెలుసుకుని అవేళ తను పెట్టిన కేక ఇప్పటికి నా చెవుల్లో గింగురు మంటుంది. పెట్టిందంటే పెట్టదూ మరి? హడిలిపోయింది పాపం నన్ను చూసి. నా తప్పేవుంది? అంతా అంజిగాడి ప్రోద్బలం. కిటికీ లోపల వాడికేదో కనబడిందిట. అదేదో నన్ను చూసి రమ్మన్నాడు. పిరికి వెధవ! సరేనని చూతునా కిటికీలోంచి.. లోపల తను ఏదో చేసుకుంటోంది. పాపం తలతిప్పి కిటికీలో నన్ను చూసి గతుక్కుమంది. వెంటనే కెవ్వుమని కేక! అది విని వాళ్ళ నాన్న పరిగెట్టుకొచ్చేడు. కిటికీ దగ్గర నన్ను చూసి ఉగ్రనరసింహుళ్ళా ఊగిపోయేడు. చిక్కుంటే చీల్చీసీవాడే పేగులు.. విల్లొదిలిన అమ్ముల్లా వెనక్కి చూడకుండా పరిగెత్తేం నేనూ అంజీ.

మళ్ళీ లంకవీధికి నేను వెళ్ళడంలో అంజిగాడి ప్రోద్బలం ఏవీ లేదు. నాకే పోవాలనిపించింది. పొడుగమ్మాయి ఈ సారి నన్ను చూసి భయపళ్ళేదు. పైగా నవ్వింది. దగ్గరగా రమ్మని సైగ చేసింది. వెళ్ళేను. ఆతరవాత ఏం జరిగిందీ అనీది చెప్పుకోక్కల్లేదు. కొన్నికొన్ని చెప్పుకోం.

విషయవేవిటంటే రానానూ నాకూ తనకీ బలే ఇష్టవయింది. చక్కగా చనువుగా ఉండేవాళ్ళం. అయితే అలా ఎంతో కాలం కాలేదు. వాళ్ళ నాన్న పణ్ణిచ్చుంటే అయ్యేది. ఓ సారి మేవిద్దరం జంటగా వాళ్ళ నాన్న కంట పడ్డాం. గదిలో తను, కిటికీ ఊచలు పట్టుకుని నేను. మామూలుగా రంకె వేసి నన్ను తరిమేసిన తరవాత, నేను పారిపోయినట్టే నటించి, తిరిగి కిటికీ దగ్గరగా గోడవతల నక్కేను. కూతురి మీద ఏదో కేకలేస్తున్నాడు. నాతో స్నేహం మంచిది కాదట. నేనూ నాలాటి వాళ్ళూ వెధవలంట. వెధవ పన్లు చేస్తావుట. ఏదైనా చెడగొట్టడంలో మమ్మల్ని చెప్పి ఇంకోళ్ళని చెప్పాలిట. తిరుగుబోతులంట. ఇలా ఏదేదో కూసేడు. నన్నూ, అంజిగాణ్ణీ ..ఇంకా మాలాటి వాళ్ళందరినీ త్వరలోనే ఊళ్ళోంచి వెళ్ళగొట్టేస్తాడట. వెళ్ళగొట్టడానికి తనెవడు? తనకెంత హక్కుందో ఈ ఊళ్ళో ఉండడానికి మాకూ అంతే. ఒకళ్ళిస్తే పుచ్చుకునే స్వాతంత్ర్యం కూడా ఒక స్వాతంత్ర్యవేనా? మా వ్యవహారం ముదిరి మాను కాకముందే పీకిపారేక పోతే తనాఊరికి పెద్దగా ఉండి లాభం లేదట.

అన్నట్టు పొడుగమ్మాయీ వాళ్ళ నాన్న ఊరి పెద్దల్లో పెద్ద. అందర్నీ అదుపాజ్ఞల్లో ఉంచుతాడు. అసలా ఊళ్ళో తనదే పెద్ద ఇల్లు. మూడంతస్తుల మేడ. ఊరికి ఉత్తరాన కనుచూపు మేర భూములు కూడా తనవే. పిత్రార్జితం అంటారు కొందరు. ఆ మాట అందరూ ఒప్పుకోలేదు. దగా చేసి లాగీసేడు చిన్నా చితకా రైతుల దగ్గర్నుంచి అని కొందరనేవారు. అలా అనే వాళ్ళల్లో కొంతమందికి అకస్మాత్తుగా

కలిసొచ్చింది. వాళ్ళలో కొంతమంది రెండతస్తుల వరకూ ఎదిగేరు. వాళ్ళిప్పుడు పొడుగామ్మాయీ వాళ్ళ నాన్నకి ఎండవనీ, వానవనీ, కాకపోనీ గొడుగు పడతారు.. కలిసిరానివాళ్ళు కొన్నాళ్ళకి కనబళ్ళేదు. వాళ్ళు ఊరొదిలి తీర్థయాత్రలకి వెళ్ళిపోయేరని చెప్పుకుంటారు. పొడుగమ్మాయీ వాళ్ళ నాన్న అలా చాలామందిని తీర్థయాత్రలకి పంపించేడని గుసగుసగా కొందరనుకుంటారు. ఇంతకీ తనకా భూములెలా దక్కేయి అనేది గొప్ప దేవరహస్యవయిపోయింది. తీర్థయాత్రలకెళ్ళే యోగవుంటే తప్ప ఆ రహస్యం ఊసెవడూ ఎత్తడు. అదీ అదుపాజ్ఞల్లో ఉంచడవంటే.

కాకపోతే మాణిక్యవనీసి ఒకామె ఉండీది. తను మటుకూ పొడుగమ్మాయీ వాళ్ళ నాన్న అదుపాజ్ఞల్లో ఉండీది కాదు. తనది చిన్నవీధి పక్క సందు. ఎత్తురుగులిల్లు. వీధి తలుపెప్పుడూ మూసే ఉంటుంది. వచ్చేవాళ్ళు పోయే వాళ్ళు అందరికీ పెరటి తలుపే. నేనూ అంజీ మాణిక్యవింటికి తరచు వెళ్ళే వాళ్ళం. తనకి మేవిద్దరవంటే చాలా ఇష్టం. మాతోపాటు తిరిగే మూక మటుకు తనకి పడదు.

పొడుగమ్మాయీ వాళ్ళ నాన్న మాణిక్యవింటికి శనాదివారాలు, అప్పుడప్పుడు వారంపూటా చీకటి కానిచ్చి వస్తూండేవాడు. అది మాణిక్యానికి, మాకూ, మహా అయితే చీకటికి తప్ప మరో కంటికి తెలీదు. దేవ రహస్యాల్లో ఇదొకటి. కాకపోతే ఓ సారి మాణిక్యంతో తనున్నప్పుడు కిటికీ లోంచి నేను చూడ్డం తను చూసేడు. ఇక్కడికొచ్చా డానా అంటూ భగ్గుమన్నాడు. చేతిలోకి ఏదో తీసుకుని కొట్టడానికి వచ్చేడు. నేను పారిపోతూంటే చూసి మాణిక్యం పకపకమంది. ఎన్నాళ్ళని పారిపోతాను? కొన్నికొన్ని భయాలు పారిపోతున్నకొద్దీ తరుముకొస్తాయి. ఎదురు నిల్చి ముక్కూముక్కూ ఆనించి నేనెంతంటే నువ్వెంత అనాల్సిందే. లేకపోతే బతికినంతకాలం భయం తప్పదు, పరుగు తప్పదు అంటాడు అంజిగాడు. పిరికి వెధవైనా సూక్తులు మటుకూ బాగానే తడతాయి. వాడి తప్పేవుందిలే.. వాడికి చేతకానిది ఇంకోడికి అక్కరకకు రాకూడదా ఏం?

కొన్నాళ్ళకి నేనూ అంజీ ఊరవతల మావిడితోటకి ఊరికే సరదాగా వెళ్ళేం. అక్కడ ఒక చెట్టుకింద కొంతమంది పొడుగమ్మాయీ వాళ్ళ నాన్నతో సహా ఉన్నారు. కొంచెం దగ్గరగా నక్కుతూ పోయి ఏవవుతోందా అని చూసేం. చిన్నగా చీకటి పడుతోంది. ఎండలేకపోయినా పొడుగమ్మాయీ వాళ్ళ నాన్నకి ఎవరో గొడుగు పడుతున్నారు. తమరి స్వాధీనంలో అయితే దేవుడి భూములు మరింత పచ్చగా పండుతాయి అని ఒకాయన అంటున్నాడు పొడుగమ్మాయీవాళ్ళ నాన్నతో. ఏవేవో చేతులు మారుతున్నాయి.

ఆ క్షణాన.. అంజిగాడికేం బుద్ధి పుట్టిందో కానీ దూకుతూ పోయి అమాంతం చేతులు మారుతున్న పెట్టె నొకదాన్ని ఠక్కున లాక్కుని ఎంత వేగం వెళ్ళేడో అంత వేగం వెనక్కొచ్చేడు. వాడి పిరికితనం అణువణువూ ధైర్యం గా మారిపోతే తప్ప కానీఅటువంటిది సాధ్యం కాదు. నేనే చేష్టలుడిగి నిలబడ్డాను. చెట్టుకింద మనుషులు తిట్టుకుంటూ చేతికి దొరికింది తీసుకుని గురైనా చూడకుండా విసరడం మొదలెట్టేరు. ఓ రాయొచ్చి అంజిగాడి కణత కి తగిలింది. రక్తంవో డుతున్నా పెట్టె వదలకుండా పరిగెత్తేడు. నేనూ వాడివెంటే పరుగు. వెనకాల తిట్లూ శాపనార్థాలూ రాళ్ళూ రప్పలూ అన్నీ కలిసి పడుతున్నాయి. మనుషులు తరివినప్పుడల్లా మాకు పరుగు అలవాటే. ఎలాగో తప్పించుకుపోయేం.

మర్నాడు ఊళ్ళో పొడుగమ్మాయీ వాళ్ళ నాన్న సభచేసేడు. మేం పెచ్చుమీరిపోతున్నావనీ, ఉపేక్షిస్తే లాభం లేదని, ఊళ్ళోంచి తరిమి కొట్టాలనీ, ఎలాగైనా ఏం చేసైనా మా బెడద తక్షణవే వదిలేలా జరగాలనీ ప్రతిపాదన చేసేడు. అంతా క్షణంలో ఆమోదించేరు. ప్రతిపాదన అమలు కావడానికి ఎక్కువసేపు పట్టలేదు.

వధ మొదలైంది. అంతా కకా వికలవయ్యేం. పోయినవాళ్ళు పోగా మిగిలిన వాళ్ళు ఎటో పోయేరు. కణత దెబ్బకి అంజిగాడు కోలుకోలేదు. నేనెలాగో తప్పించుకుని కొన్నాళ్ళ పాటు కనబడకుండా చెట్టూ పుట్టా పట్టుకుని తిరిగేను. ఎన్నాళ్ళని? కడుపు దహించుకు పోతూంటే.. చివరకి ఊళ్ళో హనుమంతుడి గుడి దగ్గరికి ఓ రోజు తెల్లారికట్లే వెళ్ళేను ఏదన్నా దొరికితే తిందావని. అక్కడ మెట్ల మీద ముష్టివాడు నన్ను జాలిగా చూసి చేతిలో అరిటిపండు నా వైపు విసిరేడు. గాల్లోనే పట్టుకుని తొక్కతో సహా ఆత్రంగా నవిలి తినేసేను. ఇంకో అరిటి

పండు విసురుతున్నట్టు ఉత్తినే గాల్లో చెయ్యాడించేడు. అది గమనించకుండా గభాల్న గెంతు వేసి అందుకో బోయేను. వాడు పగలబడి నవ్వేడు. నాకు రోషం వచ్చింది. వాడు దగ్గరగా రమ్మని సైగ చేసేడు. నేను సంకోచిస్తూ దూరంగా కూచున్నాను. ఇంతలో పొడుగమ్మాయియా వాళ్ళ నాన్న .. దర్శనానికొచ్చుంటాడు.. నన్ను చూసి "దొంగ ముండా.. మీ పీడకాస్తా వదిలిందనుకుంటే రావణ కాష్టంలా ఇంకా తగలడుతోందికదే" .. అని కేకలేసుకుంటూ నా వైపొచ్చేడు. కేకలకి భక్తులంతా పోగయి నావైపు పరిగెత్తుకు రావడం మొదలెట్టేరు. నా ప్రాణాలు పైనే పోయేయి. ఒక్క గెంతు గెంతి నేను ముష్టివాడి వెనకాల దాక్కున్నాను. వాడు నన్ను రెండు చేతులూ వెనక్కి పెట్టి దాచేడు.

పొడుగమ్మాయియా వాళ్ళ నాన్న ముష్టివాడి దగ్గరికొచ్చి, "ఏరా.. వీటి సంగతి తెలీదా.. ఊరంతా ధ్వంసం చేస్తున్నాయి.

వీటిని సర్వనాశనం చెయ్యాలి. వదులు" అంటూ గద్దించేడు. ముష్టివాడు "పోనీలేండి బాబయ్యా.. అలగనీస్తేఎలగ దీన్నొక్కదాన్నీ వొదిలీద్దురూ.. నాను సూసుకుంతను కదా.. హనుమంతులోరి సంతతేకదేటిది .. దేవుడి ముకం సూసి దయుంచండి బాబూ.. తవర్లోటోళ్ళు జాల్తలవాలే గానే.. .." అన్నాడు.

ఎలా కుదిరిందో గానీ ఒప్పందం కుదిరింది. ముష్టివాడు నా మెళ్ళో తాడు కట్టి అటుకొస తన చేత్తో పట్టుకున్నాడు. నాకో కుచ్చు టోపీ పెట్టేడు. నా పునర్జన్మ అలా మొదలైంది.

రోజూ ఉదయాన్నే నేనూ ముష్టివాడూ ఊరంతా అడుక్కోడానికి పోతాం. ఇంటింటి దగ్గరా ఆగి ముష్టివాడరుస్తాడు.. ఎవరన్నా కానీ పరకా పడేస్తే అది నేను తీసుకుని ముష్టివాడి కిస్తే వాడు బొడ్లో దాచుకుంటాడు. అరిటి పళ్ళు మాత్రం నాకిచ్చేస్తాడు. ఒక్కోసారి వాడి భుజం మీద కూచుంటాను. ఒక్కోసారి వాడికి ముందు నడుస్తాను.

నాకిప్పుడు మునపటి స్వాతంత్ర్యం లేదు. నా మెడకి తాడుంటుంది. దాని కొస ముష్టి వాడి చేతిలో ఉంటుంది. నా స్వాతంత్ర్యం తాడు పొడుగంత. పొడుగమ్మాయియా వాళ్ళ నాన్న ముష్టివాణ్ణి నన్నుంచుకోనిచ్చింది ఆ ఒప్పందమ్మీదే దొరికితే తింటాం. లేకపోతే లేదు. లంకవీధి కి మాత్రం మేవెప్పుడూ పోం. తాడు నిడివి తగ్గించమని పొడుగామ్మాయియా వాళ్ళ నాన్న అన్నా అనచ్చు. ఎందుకొచ్చిన గొడవ?

***

## మూడోకన్ను

ఎండ మండి పోతోంది.

కాళ్ళ కింద మంట. నెత్తిమీద మంట

కణకణ మండే బొగ్గుల కుంపటి మోసుకుంటూ నిప్పుల్లో నిలబడ్డట్టు..

ఆ కుంపట్లో బొగ్గులు ఒలికి ఒంటి మీద పడుతున్నట్టు..

సకల చరాచర జగతి అగ్నిలో పడ్డ శలభంలా ఏ క్షణంలో భగ్గుమంటుందా అన్నట్టు..

పోనీ..మస్సైపోనీ.. ఇదే చివర కానీ .. భగవల్లీల..

జగదుదయ విభవ లయాదులు దేవుడి లీలలు కావూ.. కావాలంటే ఏ స్వాములవారి నైనా కదుపు..

"బాబూ.."

" "

"మారాజా.."

" "

"దరమం మారాజా.."

" "

"గుడ్డెదవని తండ్రీ.."

"వెళ్ళు వెళ్ళు"

"అలగనీకండి బాబూ"

"ఇంకెలా అనాలేం"

"నానేటి సెప్పేది మారాజా"

"ఏం.. నేనన్నది నీకు నచ్చకపోతే నచ్చేమాటేదో చెప్పు అంటాను.."

"ఏటన్డానికీ ఎవురికైనాను ఏటున్నాది బాబయ్యా.."

"మరేం"

"గుండెల్లో కనికారాన్ని బట్టి కానో పరకో ..అంతెకానీ.. నోటికి పనేటున్నాది మారాజా"

"నోరు మూసుకోమంటున్నావా"

"అచ్చి..నానెక్కడన్నాను బాబయ్యా"

"అంటూ అంటూ.. అన్లేదనీసి అబద్ధం కూడానా"

"అడుక్కోడానికి తప్ప నోరు తెరవనోళ్ళం.. తప్పుడు మాటలెలగనగలం తండ్రీ.."

"నాకు చెవుడనుకున్నావా?.."

"అలగెలగనుకుంతవు బాబూ.."

" "

ఎలా అనుకోవడమేవిటి? వెర్రి ప్రశ్న. ఏదైనా అనుకోవచ్చు. ఇచ్చేవాడూ పుచ్చుకునే వాడూ.. రిలేషనెరగవూ.. మందలించకు. హెచ్చరించకు. బోధించకు. ఉపదేశించకు. హెచ్చరించడానికీ, మందలించడానికీ. నీకు పెద్దరికం లేదు. ఉపదేశాలకీ, బోధలకీ నువ్వేం ఊడిపడలేదు. ఇహ ప్రశ్న. సింపుల్. ప్రశ్నించకు. సమాధానపడు. నీ మొహంలో లక్ష ముడతలున్నాయి. పార పన్నూ, తొర్రి పెదవి, గుడ్డి కళ్ళూ, డొక్క కడుపు, తొక్క వొళ్ళు, చేతి కర్రా,.. బోలెడు సామగ్రి. ఉపయోగించి కరిగించు. నీకు వెయ్యాలా వద్దా అనీ నా ధర్మసంకటం నీ ప్రాణానికొచ్చేలోగా..

"తవరింతడీస్తే గాని గడవనోళ్ళం.. దయుంచు బాబూ."

" "

"దరమ రాజులాటోడివి.. ఎండకి పేనవెగిరిపోతన్నది మారాజా.. ఇంత ముద్దకడీ తండ్రీ"

" "

ఉన్న ఒక్క సూర్యుడికీ ఇటించటు పోడానికి ఇంత మంది మాడి చావాలా. అన్యాయం. సూర్యగోళం, భూగోళం.. గోళం గోళాన్ని కాల్చుకుతింటోంది. గోళానికి జాలేవిటి? మరి సూర్యుడికో?.. ఎన్ని ఆదిత్యహృదయాలనుసంధిస్తే సవిత చల్లబడేట్టు. సప్తాశ్వరథారూఢుడై సవిత చండ ప్రచండ పరక్రమంతో పరిపంధి అనగా వైరిగణములు దోధూయమానమవుతూండగా.. నా బొంద.. నా తలకాయ... నాన్సెన్స్.. ఏదీ లేదు. అన్నన్న.. అలా అనీకు.. దేన్నీ లేదనకు. లేనిదికూడా ఉందను. జాగీరవనీ, జానెడు పొట్టవనీ.. కొట్టాల్సినచోట కొట్టు.

తగలాల్సినచోట తగిలించు. పాషాణం ప్రసన్నం కావాలంటే ఒకటే మార్గం. పొగుడు. కరిగి నీరు కాలేదూ.. ఉబ్బి తబ్బిబ్బు చెయ్యి. నోరు వధారణ చేసుకుని పొగుడు. పనవుతుంది. పూర్వవప్పుడు రాజులూ వాళ్ళ దగ్గరనుండి ఏదన్నా రాలిందంటే ఇంద్రుడూ చంద్రుడూ వల్లేకానీ ఇంకోదాని వల్లా? అదేవిటీ .. ఆ పద్యం.. హర నిటల నటత్పావక పరిభావి మహ: ప్రావృత నిఖిలాశా కృష్ణరాయ మహీశా..! ఆహా..అలా ఉండాలి. సానబెట్టి, చెవుల దాకా సాగదీసి వదిలేసిన సమ్మోహనాస్త్రంలా. స్ఫురున దిగబడిపోవాలి.

"తవర్ని కన్నోళ్ళు సల్లగుంటారు తండ్రీ"

" "

"తవరు కన్నోళ్ళ పచ్చగుంటారు మారాజా"

ఫలితం దక్కకపోయినా ఫలశృతి చెపుతున్నాడు. ఆర్తా: విషణ్ణా: శిధిలా: భీతా: ఎట్సెట్రా ఎట్సెట్రా నారాయణ శబ్ద మాత్రం సంకీర్త్య..

"కడుమ్మండి పోతన్నది బాబూ"

" "

నీ దైన్యం దేన్నీ కరిగించదు. నీ ప్రశంశ దేన్నీ మురిపించదు.

నువ్వనగలిగినదేం లేదు. నిర్ణయం జరిగిపోయింది.

అందుక్కారణం ఫలాన కాదు. ధర్మ సంకటవా.. పాడా.. నీకు విదల్చకపోడానికి పై ఎండ నుంచి ఎదురుగా ఉన్న అమ్మాయి వరకూ ఎన్ని దుర్బల నిమిత్త కారణాలో.. ఎన్ని వేరియబుల్సో.. ఏ సమీకరణంలోనో జొరబడి .. చివరకి ఈజీకొల్టూ 'వెయ్యకు' అని తేల్చేసేయి. నీకిహ ఇక్కడ మూడువంతుల ముప్పాతిక రాలేది లేదు. మిగతా పాతిక్కి నువ్వు నెత్తీనోరూ బాదుకుంటే మంచిదే బాదుకో. పాతికంటే.. ఆడ్స్ ఫరవాలేదు. మనసుంది చూసేవ్.. వెధవది, ఠక్కున మారుతుంది.

"పేనవెగిరిపోతన్నది మారాజా.. తండ్రీ.."

"ఎయ్.. వెళ్ళ మని చెప్పేనా.. ఏవిటి.. బంకలాగ.. అసలే ఎండ మండిపోతూఉంటే.. వెళ్ళువెళ్ళు "

"సరేలే మారాజా.. ఎలిపోతన్లే..మర్నీకు దయ కలిగింది కాదు.. గుడ్డోణ్ణనీసైనా దయుంచినావు కాదు.."

"సరేలే.. వెధవ కబుర్లు.."

"కబుర్లనీసన్నారు కనకంటన్నను కానీ.. మారాజా.. మొదటి ముష్టోడున్నాడు సూసేవూ. ఆడికి మూడుకళ్ళు.

ఆడి మూడో కన్ను మటుకూ ఉండాల్సిన సోట ఉన్నాది కాదు. ఆడికన్ను నుదట్న కాకుండా మనసుకున్నాదనుకో.. నీకూ నాకూ ఈ యుద్దవే ఉండేది కాదు. నీ కళ్ళే నాకళ్ళయ్యావి."

"చాల్చాల్లే.. పురాణం చెపుతున్నావ్.. వెళ్ళవతలికి. పోలీసుని పిలిపించి గెంటించే గలను"

"ఎందుకు మారాజా.. ఎలిపోతన్లే.. ఎలిపోక ఉండిపోతనేటి?"

గుడ్డిబిచ్చగాడు కదిలేడు. వాడు క్రాడించుకుంటూ నాదాకా వచ్చి నన్ను దాటుకుపోతూంటే పోతుంటే.. నేను వాడి డబ్బాలో ఇంత చిల్లర పడేసేను. చప్పుడయితే వాడు తలెత్తి నాకు సకల శుభ సంపదలూ కలగాలని అన్నాడు.

***

# ప్రార్థన

తెలతెల వారుతూండగా తన ప్రాణం పోయింది.

పెద్దగా ఘర్షణ లేదు.

మధ్యాన్నవే డాక్టరు మహాఅయితే ఆర్నెల్లన్నాడు. మంచినీళ్ళు అడిగితే తెచ్చి ఇచ్చేలోపు ప్రాణం పోయింది.

తనిప్పుడు శవం.

ఇన్నాళ్ళూ తనని నడిపించినదేదో ఇప్పుడిక తనలో లేదు. కళ్ళు మూసున్నాయి. వాటిల్లో ఒకప్పుడు ఎంత భావం పలికింది! ఇప్పుడు చూస్తే రెప్పలువాలి ఏ దివ్యాద్భుతలోక సందర్శన విభ్రమానికో విస్మయపడి వివశంగా మూసుకున్నట్టున్నాయి. వైకుంఠలోకం అయి ఉండాలి. వైకుంఠ ద్వారం తెరిచి, ఇరుగడలా దోసిళ్ళ నానా సూన వితానములతో, కరముల వింజామరలతో, విష్వక్సేనాది భాగవతోత్తములు తన రాకకోసం ఎదురు చూస్తూంటే.. తనకా గౌరవ స్వాగత సన్నాహ స్ఫురణ సంభ్రమ జనకమై .. ఆనందవివశత కలిగి కళ్ళు మూసుకున్నాయి.. అంతే!

..పంజరాన ఓ పిట్టుంది

గింజలమోజిక లేదంది

రెక్కా రెక్కా చాచిందీ

ఎంచక్కా ఎగిరీ పోయింది..

రాయలేదూ నేను?.

పరమపదం.. దివ్యాయతనం .. అదే నిరవధికానందానికాకరసీమ.

తన ఆత్మ చేరదగ్గ చోటుకి చేరింది.. అది మటుకూ ఖచ్చితం .. దానికి తిరుగులేదు...

అయినా ఆగదేం దు:ఖం?

"జాతస్యహి.. తెలుసుకదా.. ఇంకా ఏడుపెందుకుచెప్పు?" ఎవరో అంటున్నారు.

ఏం చెప్పడానికీ ఏవుంది?

ఒక్కోఓదార్పు మరింత దు:ఖాన్ని తెస్తుంది. ఎవరన్నా ఓదార్చిన కొద్దీ గుండెలవిసిపోతున్నాయి. ఊరుకో అన్న కొద్దీ ఉబికి వస్తోంది ఏడుపు. అదిమిపెట్టినకొద్దీ పంతంపట్టి మరీ పైకి తంతోంది.

"ఎవరాపగలిగేరని.. మన చేతుల్లో ఉందా?.. పిలుపొచ్చింది, అంతే"

నిజవే.

చేట నుండి కాటికి..

ప్రాణం పోతుంది. పట్టుక్కూచుంటే ఆగుంతుందా.. కట్టె బిగుసుకుపోతుంది.. కట్టి మోసుకుపోతారు..

పిడికెడు బుగ్గి.. మాయామేయ జగంబు.. మూణ్ణాళ్ళ ముచ్చట.. ఎందుకు తెలీదు?

ఎరిగినదల్లా జ్ఞానవూ, జరిగినదల్లా అనుభవమూ అయిపోతే ఇంకేం.. బుద్ధికి తెలుసు.. కానీ బుద్ధి చేష్టలుడిగింది. మనసు ఇష్టారాజ్యంగా ఉంది. సంకల్ప వికల్పాలు మనసువి. మహా శాశిస్తోంది..

"కాస్త స్థిమిత పడు.. సంబాళించుకో"

పక్కలెగిసి పడుతున్నాయి.. సంబాళించుకుందునా.. ఏవనుకుని? చెప్పరాదూ.. కోపం లేదు సుమా.. కోరిఅడుగుతున్నాను.
కనికరించి నన్ను కడతేర్చు. నాకళ్ళ ముందు పుట్టిన దు:ఖం నా ప్రమేయం లేకుండా రాక్షస ప్రమాణాల కెదిగిపోయింది. నన్ను బారలు చాచి లాక్కుని మరీ ముంచేస్తోంది. ఇదో అనంత దు:ఖ సింధువు. కథం తరేయం?.. కావా గతిర్మే?.. నా చెయ్యందుకో.. గభాల్న లాగి బయటపడేయ్.. మూర్ఛపడుంటాను.. తేర్చకు.. అలా పడుండనీ ..
మెలకువొద్దు.. మెలకువొస్తే జ్ఞాపకాలు.. ఏ ఒక్క జ్ఞాపకాన్నీ భరించలేను..
ఆ సాన్నిహిత్యం.. స్పర్శ.. చూపు.. చలనం.. మాట.. మందలింపు.. నవ్వు.. పిలుపు.. పలుకు.. అంతా ఏదీ? ఇంత బతుకూ ఇన్ని జ్ఞాపకాల్లో ఇమిడిపోతుంది. ఉండాల్సింది రేపణ్ణుంచి ఉన్నచోట ఉండదు.. అలవాటుగా కళ్ళు వెతుకుతాయ్.. వెతికిన కళ్ళల్లో తను తిరిగిరానితనం శిలాశాసనంలా తిష్ఠవేసుకుంటుంది నిజం నీ మనసులో స్ఫురిస్తుంది. దానికి భావ వికారాలుండవు. దానంత నిర్దాక్షిణ్యపుది ఇంకోటి లేదు. నిన్ను నిలువునా దహించినా దానికి చీమ కుట్టదు..
వియోగం.. విహ్వలత... ఎంతకని కారుతాయ్ కళ్ళు? ధారలు కట్టి కట్టి చారలు మిగిలిపోతాయి. మనసుకీ కళ్ళకీ లంకె తెగిపోతుంది. ప్రతి రెప్ప పాటుకీ కళ్ళు పొడిపొడిగా మండుతుంటాయి. మనసు మాత్రం ఇంకా దు:ఖంతో బరువెక్కి పోతూ ఉంటుంది. ఎలా మోసేట్టు? కొండలుతిని కండలు పెంచుకున్న నలుగురు బలాఢ్యుల్ని రప్పింతునా?.. నా మనసు మోయండిరా అని అప్పగింతునా?..
ఏ దివ్యశక్తో నీ ముందు సాక్షాత్కరించి .. తన అఖండ ద్యుతికి నీ కళ్ళు అబ్బురపడుతుంటే.. నిన్ను అతి లలితంగా అక్కున చేర్చుకుని.. ఏదో కూని రాగపు గాలిపాట అస్పష్టంగా పాడుతూ.. 'మరి నా మనసు' అంటూ ఏదో నువ్వనబోతే.. 'ఉష్.. ఈ పాట వింటూ పడుకోవడవే ప్రస్తుతం నీ పని' అని వారిస్తే ..ఆ ప్రస్తుతవే శాశ్వతమవమని నువ్వు కోటి మొక్కులు మొక్కుకుంటావు .. మత్తుగా .. మగతగా.. ఏవిటా పాట.. మంద్రంలో సాగుతోంది.. నిస్తంద్ర రసానుభూతిని కలిగిస్తూ.. ఆహ్హా .. ఇది గాలిపాటేవిటి.. విమల గాంధర్వంబు.. కౌసల్యదా.. యశోదదా.. బలే ఉంది.. కలిసి పాడుదునా..

..గాలి పాటలు కావమ్మా
గంధర్వ గానాలే
నీలి కళ్ళకు పలికేటి
నిదుర ఆహ్వానాలే..

.. ఇంత తేలికతనం ఎప్పుడూ అనుభవం కాలేదు. సర్వేంద్రియాలూ పరాధీనం చేస్తోందీ పాట..
"నీళ్ళు..నీళ్ళు.. కొంచెం తెచ్చి చిలకరించండి.. తెలివి తప్పుతూన్నట్టుంది.."
ఎందుకు తెలివి? లాభం లేదు. నేనీ దు:ఖం అనుభవించాల్సిందే
ఏ నాడయితే తన జ్ఞాపకాలు నాకు దు:ఖావేశం లేకుండా కలుగుతాయో ఆనాటివరకూ నేను వేచి ఉండాల్సిందే.
దానికి నేను చేయదగ్గ ప్రార్థన ఒకటే..
ఓ ఆద్యంత రహిత కాలమా! కదలిరా.. నీ మాయని ప్రయోగించు.. నీ చక్రాన్ని పరిగెత్తించు.. త్వరగా....
కనికరించి నాపై దయుంచు! నాకింక శక్తిలేదు. నీకో గుడి కడతాను.. ధూప దీప నైవేద్యాలతో నిత్యార్చనలు చేయిస్తాను. నీపేరునో వెయ్యి పేర్లు చేస్తాను.. కోటిసార్లు జపిస్తాను.. నీ మీద స్తోత్రాలల్లిస్తాను. వారంలో ఒక రోజు నీకు కేటాయింపచేస్తాను.. చూసేవా నా వెర్రి.. ఏ రోజూ మొదలవడం నీ చేతిలో ఉంటే నీకు నేనో రోజిస్తానట.. నా దురహంకారానికి హద్దులేదు .. కోప్పడకేం.. నీ చక్రధాటికి నన్ను పాత్రం చెయ్యి.. రా.. కదిలిరా.. రా.. కదిలిరా.. రా.. కదిలిరా.. రావూ..
"అయ్యో.. అయ్యో..తెలివి పూర్తిగా తప్పినట్టుంది".

# రగ్గులుగాడు(రు)

రగ్గులుగాడు ఎకేఎ రఘురాముడు పుట్టినప్పుడు మరువాడ సిద్ధాంతి ఘడియల్లెక్కించి ఆశ్చర్యంగా నోటిమీద వేలు వేసుకుని కాసేపటివరకూ తియ్యలేదు. తియ్యకపోయేసరికి రఘురాముడి నాయనమ్మ టెన్షను తట్టుకోలేక చెప్తావా ఛస్తావా అంటూ సిద్ధాంతి మీద బీపీ తెచ్చుకుంది. చివరకి సిద్ధాంతి పైకీ కిందికీ పరీక్షగా చూసి వీడు మామూలు జాతకుడు కాదు, మహా జాతకుడు అన్నాడు.

అంతా సంతోషించేరు. నేను చెప్పలేదూ మన రగ్గులు గాడు రాజాధిరాజు అవుతాడు అంటూ రఘురాముడి నాయనమ్మ పరమానంద భరిత అయి, నేనప్పటివరకూ ఉంటానో ఉండనో అంటూ వెంటనే చింతాక్రాంత అయింది. అదావిడకి మామూలే.

సంతోషం సద్దుమణిగేక, నిజవేకానీ మహా అంటున్నాడు మరి ఎంతమహా అనీసి ప్రశ్నొచ్చింది. వివరాలడిగితే సిద్ధాంతి గురుడనీ, గళ్ళనీ, గ్రహాలనీ 'గ' గుణింతం వల్లెవేసి ఒహటని చెప్పడానికి లేదంటూ తేల్చేడు.

రఘురాముడి తల్లి మటుకూ ఎందుకునాయనా ఇవన్నీను, నా కొడుకు రాజ్యాలేలలా ఏవిటి, నోట్లోకి మూడు పూటలా నాలుగు వేళ్ళూ వెళితే చాలదూ అంది. అదీ నిజవే అంటూ సిద్ధాంతి సంభావన బొజ్జో దోపుకుని లేచెళిపోయేడు.

అయితే రఘురాముడు ఎంత మహా జాతకుడూ అనీది ఒహంతట తేలలేదు. వాడికి బడికెళ్ళే వయసొచ్చేక కాన్వెంటులో వేసేరు. కాన్వెంటు కాకపోతే రఘురాముడి నాయనమ్మ అన్నం నీళ్ళూ మానెస్తానని భీష్మించింది. కాన్వెంటుకీ 'మహా' కీ ఆవిడకి బోధపరచలేని లంకె కనబడ్డది.

కాన్వెంటుకి 'తయారయి' వెళ్ళాలి. బూట్లూ, టయ్యీ, యూనీఫారమూ, రిక్షావో, బస్సో ఇలా లక్షుంటాయి. మామూలుగా గుండీల్లేని చొక్కా ఒకటి వేసుకోని, జారి పోతున్న లాగు చేత్తో పైకి లాక్కుంటూ, పలకొకటి పట్టుకుని పరిగెత్తి పరిగెత్తి వెళిపోడానికి లేదు. వాడికదంతా ఏదో శిక్షలా ఉండీది.

కొన్నాళ్ళు వెళ్ళి ఇహ అక్కణ్ణుంచీ వెళ్ళనని పంతం పట్టేడు. తోసినా, లాగినా, ఈడ్చినా, ఎత్తి కుదేసినా.. లాభం లేకపోయింది. రిక్షా ఎక్కను గాక ఎక్కను అని భీష్మించేడు. చాకలేటిస్తాను వెళ్తే అంటే ఇస్తే వెళతానని, ఇస్తే పుచ్చుకోని చక్కగా ముచ్చె ఒలుచుకోని తినీసి మళ్ళీ మొదటికొచ్చీవాడు. రోజూ ఇదో గొడవ. ఉదయాన్నే వీధిలో పెద్ద తతంగం. దారినపోయేవాళ్ళు చోద్యం చూసినట్టు ఓసారాగి కాసేపు చూసి వెళ్ళేవారు.

ఈ బాధ పళ్ళేక చివరకి కాన్వెంటు మానిపించేసి పొరుగు వీధిలో ఉన్న కామేశ్వరీ స్కూల్లో వేసేరు రఘురాముణ్ణి. మరువాడ సిద్ధాంతి మనవడిదీ అదే స్కూలు. వాళ్ళిద్దరికీ తెగ దోస్తీ. వాడి తాతప్రభావం ఇద్దరిమీదా పడింది. జాతకాలూ,గడియలూ, గంటలూ, వర్జాలూ, రాశులూ, నక్షత్రాలూ, ముహూర్తాలూ ఇలా .. దోస్తీ పెరిగినకొద్దీ రఘురాముడికి పరిభాషా పరిజ్ఞానవూ రెండూ పెరిగినై.

అంతా బానే ఉంది కానీ రఘురాముడికి లెక్కల గండం ఉన్నట్టు తేలింది. వాడికి లెక్కలు ఒహంతట ఒచ్చీవికావు. అవిరావాలంటే ముందు ఎక్కాలు రావాలని ఓ సిద్ధాంతం చేసేరు. వాడికా సిద్ధాంతం పిచ్చి సిద్ధాంతంలా తోచింది. పైకెక్కాలంటే ముందు కిందకి దిగాలి అంటారా ఎవరన్నా.

పైగా లెక్కలమేష్టరో అపరయముడు.

క్లాసులోకొస్తూనే పంథొమ్మిది పదిహేళ్ళెంత? పధ్నాల్గు పదమూళ్ళెంత? చెమ్డాలేరీగల్ను..వీపు చీరీగల్ను.. తిక్కవేషాలయ్యకండి.. అంటూ అరిచీవాడు. రఘురాముడు ఎలాగో ఒకలా పనెండు పన్నెండ్ల వరకూ కంఠతా చేసేడు. ఆ తరవాత మటుకూ వాడి వల్లయ్యింది కాదు.

గుణించడాలెలాగోనేర్చుకున్నాక వాడికి ఎక్కాల బాధ తప్పింది. కానీ లెక్కలంటే దడ మాత్రం తగ్గలేదు. కూడికలూ, తీసివేతలూ, గుణకారాలూ ఒచ్చినట్టు భాగహారాలొచ్చేవి కాదు. ఎలాగో తోసుకొచ్చేడు. పై క్లాసులకెళ్తున్నకొద్దీ కాలమూ దూరమూ లెక్కలూ, అనుపాతాల లెక్కలూ, ఇలా ఎడతెగకుండా వస్తూనే ఉండేవి.

నువ్వో రైల్లో గంటకి నలభైమైళ్ళ వేగంతో వెళుతున్నావు. అటువైపు పట్టాల మీద ఇంకో రైలు వెనక్కి ఫలాని వేగంతో వెళుతోంది..అని చదువుతూ ఉంటే వాడికి వాళ్ళ ఊరి రైల్వే స్టేషనూ.. రైల్లో ఎక్కి ఏదన్నా దూరంగా సెలవలకి ఊరెళిపోతున్నట్టు.. ఇలా ఏవేవో ఊహలొచ్చేవి. కానీ చివరకి సాపేక్ష వేగం ఎంత అనీసరికి.. ఛీ ముష్టి లెక్క.. అనుకునీవాడు.

చక్రవడ్డీ, బారువడ్డీ లెక్కలు వాడికి కంపరం కలిగించేవి. సిద్ధాంతాలూ, ఉప సిద్ధాంతాలూ, ఉపపత్తులూ.. వీటికి జుట్టే కనకుంటే దాన్ని పట్టుకుని వాటిని ఉతికియాలనుండేది వాడికి. వీటికి తోడు ఆల్జీబ్రా అంటూ ఒకటొచ్చి పడీసరికి వాడికి ప్రపంచం ఎంతో క్రూరమైనదిగా అనిపించింది.

ఇలా లెక్కలతో కుస్తీ పట్టి పట్టి వాడు మొత్తానికి టెంత్ క్లాసు బొటాబొటి మార్కులతో పాసయి బతుకుజీవుడా అని ఇంటర్ లో సీయీసీ తీసుకుని కొన్నళ్ళకి చదువు మానీసి సినీమాల్లో చాన్సుకని పట్నం వెళ్ళేడు.

హీరోగానూ, హీరో ఫ్రెండుగానూ, హీరో అన్నగానూ, హీరో మావయ్య గానూ, హీరో తండ్రి గానూ, కుదరకపోయే సరికి విలన్ గానూ, విలన్ గూండాల్లో ఒకడి గానూ ప్రయత్నించేడు. అవలేదు. కెమేరా ఇటూఅటూ లాగడం, మైకు పట్టుకోడం లాటి వాటికి ఒళ్ళు దాచుకోకుండా సహాయం చేసేడు. కనుబొమ్మలమీద వెంట్రుకల్లా అక్కడా పెరకువ లేదు. అయితే వాడి దృష్టిని ఒకటాకర్షించిది. అది సినిమాలకి ముహూర్తాలు!

ఆరంభచర్చలు మొదలుకుని కెమేరా స్విచ్చాను కలుపుకుని, రిలీజు డేటు వరకూ.. ముహూర్తావకాశాలు కొల్లలు. నిర్మాతని బట్టి ఇంకో కో ముందు తగల్చుకోచ్చు. ఎలాగో ఒకలా ఓ అవకాశం పట్టేడు. ఆ సినిమా విడుదలై పెట్టె కార్యాలయాన్ని బద్దలు చేసింది. మరికొన్ని అవకాశాలొచ్చేయి. కొన్ని ముహూర్తబాణాలు అటూ ఇటూపోయినా గురికి గుచ్చుకున్నవి ఎక్కువే.

రఘురాముడింక వెనక్కి తిరిగి చూడక్కర్లేకపోయింది. సినీమా ముహూర్తాలంటే 'రగ్గులు గారే' పెట్టాలని మొదట వార్తగా మొదలై తరవాత ఖ్యాతిగా విస్తరించింది.

సినీమాలకీ, సినిమా వాళ్ళ సందళ్ళకీ, సినీమావాళ్ళ వాళ్ళ సందళ్ళకీ అన్నిటికీ లెక్కలు కట్టి ముహూర్తాలు పెడతాడు. చేతులు చూస్తాడు, గళ్ళు గీస్తాడు, గ్రహ గతుల్ని పరిశీలిస్తాడు, సమన్వయిస్తాడు, గుణిస్తాడు, కూడుతాడు, హెచ్చిస్తాడు, భాగిస్తాడు. వాడికిప్పుడు లెక్కలగండం లేదు. వాడి లెక్కల మీద కొన్నికోట్ల పెట్టుబడి పెట్టబడుతుంది.

మొన్న కలిసినప్పుడు ఎలా ఉంది నీ వ్యాపార పాండిత్య కళా విలాసం అంటే.. ప్రస్తుతం కుజుడు ఉచ్చ లో, ఇంకోళ్ళెవరో నీచలో ఉన్నాడని అది మారితే దశమారచ్చనీ అన్నాడు. మరయితే ఏం చేస్తావు అనడిగితే.. ఏదన్నా చేయచ్చు అన్నాడు. మరి గ్రహాలూ.. అన్నాను. వాడు చిన్నగా నవ్వుతూ గ్రహగతుల్ని ఎలాగూ మార్చలేనప్పుడు నువ్వేదికావలంటే అదే చేసుకోచ్చు.. అడ్డేవుంది.. 'నువ్వు గొప్ప వాడివవుతావు.. కానీ ప్రయత్నం చెయ్యాలి' అని చెప్పే జాతకాన్ని డబ్బిచి ఎవడు చెప్పించుకుంటాడు అన్నాడు.

---

# ఆత్మ కథ

నాకు రాయకపోతే జరక్కపోదు. ఇదేవన్నా ఉద్యోగవా పాడా?

ఓ రెండు పేజీలు కళ్ళు మూసుకుని బరికేస్తే పోయేదానికి జీవన్మరణ సమస్యలా గింజుకుపోడం దేనికి? రచన ప్రసవవేదన లాటిది అంటారు. కొందరికి కావచ్చు. నాకైతే నమ్మకం లేదు. మా తాయారు మొదటికాన్పప్పుడు న్నాల్రోజులు నానా నరకయాతనా పడ్డాక చివరికి కోసి తియ్యాల్సొచ్చింది. వాళ్ళ పల్లెటూర్లో గవర్నమెంటాస్పత్రి పురుళ్ళ వార్డు లో ఇదంతాను. ఆ వార్డు ఓ సారి చూస్తే తెలుస్తుంది అక్కడ ప్రసవవేదన పడ్డవంటే ఏవిటో.

రాతమీద బతికెద్దావన్న చచ్చువెధవ ఆలోచన ఎప్పుడో నేను మానుకున్నాను. నా కళ్ళ ముందే కాదూ ఉమాపతిరావు మట్టి కొట్టుకు పోయింది. వాడికి ప్రజ్ఞ మాత్రవే కాదు లౌక్యం కూడా లేదు. అభిరుచి మాత్రం పుష్కలం. ఒక్కోదాని మీద అభిరుచి అదుపులో ఉంచుకోకపోతే అది దెయ్యపు ప్రమాణాల కెదిగి దాని ఉత్పత్తిలో నీకు సమర్ధత ఉన్నట్టు భ్రమ కలిగిస్తుంది. ఆ భ్రమ నుండి బయట పడ్డానికి ఏళ్ళు పట్టినా పట్టచ్చు.

మొదట మొదట గుడ్డు దశలో చదవి ఆనందించినవాడివల్లా తగుదునమ్మా అనీసి రాయడానికి పూనుకుంటావు. ఊరికూరికే నీకుముందు రాసిన వాళ్ళు చదివి మట్టుకే నువు రాసింది ఎంతకాలవని కక్కుతావు కనక. శాపగ్రస్త గొంగళీ పురుగులా ప్యూపా దశ యోగవన్నా లేకుండా కనబడ్డ ఆకల్లా కన్నాలు చేసుకుంటూ కాలం వెళ్ళబుచ్చుతావు.

అయితే నా ఆత్మప్రకారం కొంతమంది బ్రహ్మ వరప్రసాద లబ్ధ సుఖజీవనులుంటారు. ఆలోచన తట్టిన తడవే "ఆకాశంబుననుండి శంభుని శిరంబందుండి శీతాద్రి" లాగ బడబడా రాసేస్తారు. వాళ్ళకి జననాడి రేచుకుక్కల్లా పసిగట్టగల సత్తా ఉంటుంది. వాళ్ళ రాతలు ఎడిటరు మహదానందభరితుడై వేసేసుకుంటాడు. పాఠకులు తట్టుకోలేకపోతున్నావంటూ స్పందనిస్తారు. కొవ్వొత్తి మంటలా మొదలైన కీర్తి జ్వాజ్వల్యమానమై ఏ సినీమా వాడి కళ్ళో జిగేల్మనిపిస్తుంది. వాళ్ళు ప్రాజ్ఞులు, లౌక్యులు కూడా అవడమ్మూలాన్న జీవితశకటం బంగారు గాడీలో పడుతుంది. తిరిగి చూసుకోరు.

నాలాటి అప్రాజ్ఞుడికి ఆదిలోనే హంసపాదన్నట్టు మొదటి వాక్యం దగ్గరే మొదలవుతుంది పీకుడు. చిన్న కథకైతే మరీను. కథలోకి ఠక్కున దిగాలి. నాన్పుడు కూడదు. సుకవి ప్రశంశ, కుకవి నింద, ఇష్టదేవతా ప్రార్ధన ఇలా ఓ నలభై పేజీలు తలగెట్టకూడదు.

నా ఆత్మమటుకూ ఇలాటి సూత్రాలు వట్టి అప్రయోజకాలంటుంది. నాకేది ప్రయోజనకారో దానికి విశుద్ధంగా తెలుసు. నాకు పైకొచ్చే లక్షణాలు లేవంది. తను బ్రహ్మవరప్రసాదులనే వాళ్ళంతా నాకంటే చచ్చు రాతలు రాసేవాళ్ళేనంది. రుజువులు చూపిస్తానంది. కానీ అదో విషవలయం. తనతో తగాదా తెగేది కాదు. గ్లోబులో మోటారు సైకిల్లా బోలెడు రొద చేసుకుంటూ చాలా సేపు తిరుగుతుంది కానీ ఎక్కడికీ పోదు. మొన్నీమధ్య నేనో కథ 'తనన్న మాటలు నాకింకా జ్ఞాపకం' అని తాపీగా మొదలెడితే, నా ఆత్మ అదో చచ్చు మొదలు అని తేల్చింది.

"తనేవిటి తను.. తనకి పేరు లేదా? " అంది.

"ఉండచ్చు కానీ ఉండకపోయినా కథ నడుస్తుంది" అన్నాను.

"నాలుక్కాళ్ళ బర్రె కూడా నడుస్తుంది అదిలిస్తే. పేరు కావొద్దూ. మొదటి వాక్యంలోనే పేళ్ళూ, వాటితో చమత్కారం, యాక్షనూ, ముందేవైందీ, ఇకముందేమవుతుందీ లాటి ప్రశ్నలూ.. పూర్తిగా దట్టించద్దూ"

"ఎందుకూ?"

"ఎందుకేవిటి.. ఎలా అను.. ఉదాహరణకి దయాకర్ కళ్ళల్లో క్రౌర్యం నిండింది, భుజంగరావు జాలిగా చూసేడు, ఆనంద్ కుమిలి కుమిలి ఏడుస్తున్నాడు, నిశ్శబ్ద అరుస్తూ లేచింది.. ఇలా ఎలాగైనా మొదలెట్టచ్చు.. మొట్టమొదటి వాక్యవే ఆయువుపట్టు. సకలటెన్షనూ సమస్తఘర్షణా అక్కడే సూచన కావాలి. అప్పుడే అది చదవబుల్ అవుతుంది. "

"చదవబుల్లా? "

"అవును. పాఠకుడు మీట ఇచ్చినట్టు చదువుకుపోవాలి. అంతేకానీ పాఠకుణ్ణి చెయ్యి పట్టుకుని నడిపించే రచన గుడ్డి రచన. నీవి గుడ్డి రచనలు. "

"గుడ్డిరచనలా? "

"అవును. గుడ్డిరచనలే కాదు, నీవి గడ్డి రచనలుకూడా"

నాకు అవాక్కయ్యింది.

"గడ్డి రచనా.. అదేవిటి? " అన్నాను పెగల్చుకుని.

"నీ రచనలు ఎండిపోయుంటాయి.. కొబ్బరి పీచులోనన్నా పిండితే కారుతుందేమో కానీ నీ రచనలో మటుకూ రసం మృగ్యం"

"నా రచనలు చదివి రససిద్ధి కలిగినవాళ్ళు లేరనా?" అన్నాను.

"అది రససిద్ధే అయితే ఉండే ఉండాలి. నేనంటూన్నది మందానిలాన్ని గురించి కాదు ఝంఝూమారుతాన్ని గురించి. తాటాకు మంట గురించి కాదు మహా దావాగ్ని గురించి, మబ్బుతునక గురించి కాదు ఘన కాలాభ్రాల గురించి, ..పదార్ధవదే. పరిణామంలో తేడా... ఊపూపి వదలాలి, తగిలీ తగలనట్టు తాకి ఒదిలేస్తే ఎలా.. ఒక రొమాన్సూ, వర్ణనా, కంటతడీ, ఒక్క రసాన్నీ పుష్కలంగా పోషించవేం, మనకి తొమ్మిదికి తక్కువలేకుండా తగలడితే.. "

"వర్ణనా రసపోషణా పెద్దపన్లు. నా వల్ల కాదు"

"ఎందుక్కాదు? "

"పని గట్టుకుని దేన్నయినా ఇంకో దాన్లా ఉందనడం నాకు వ్యర్ధం గా తోస్తుంది. ఏది అదేలా ఉంటే వొచ్చిన నష్టవేవిటి.. ఉండకపోడం వల్ల కథ ముందుకు పోతుందా.. "

"తిక్కవాదన మానీ.. ఇంతకీ కధా.. కధా.. అంటున్నవు కాబట్టి ఒకటి చెప్తాను వింటావా"

"చెప్పు"

"నీ రచనల్లో అసలు కధుండదు. అంచేత కధా కధా అంటూ నీ కంఠశోష అనవసరం"

ఢమ్మున పేల్చింది. ఇదేదో ఉత్తి వాదననుకున్నాను. సాయుధ దాడి జరగబోతోంది. మోటారు సైకిలు గ్లోబుని ఊడదీసుకుని పోయేట్టుంది. సరే కానీమన్నాను. తను ఇంకా ఏవేవో చెప్పుకు పోయింది. నా రచనల్లో పాత్రలూ, పోషణా, సంభాషణలూ, వైరుధ్యాలు, ఘర్షణా, ఇలా ఏదీ ఉండదుట. విషయవుంటుంది కానీ కధుండదట. ఏవో అవుతాయి కానీ ఏదీ ప్రత్యేకంగా జరగదట. పాఠకుల్ని నేనెక్కడికీ తీసికెళ్ళనట. ఇదిదీ అని ఒహటంటూ తేల్చనట. ఇలా నా మీద ఓ దండకం చదివినట్టు చదివింది.

నాకు నిద్ర ఒచ్చేలా ఉంది. సరే కానీ నువ్వు నాచేత రాయించదలుచుకున్న కధ చూచాయగా చెప్పు. మిగతాది నేనల్లుకుపోతాను.. అన్నాను అసలు సంగతి దాచి. తను మొదలెట్టింది.

"దయాకర్ అని అందరూ దయా దయా అంటారు. "

"ఊ"

"దయాకర్ కీ నిశ్శబ్దకీ పెళ్ళవుతుంది"

"ఎక్కడా?"

"ఎక్కడైతేనేం.. హైదరాబాదులో"

"ఊ"

"ఆనంద్ నిశ్శబ్దని ప్రేమిస్తాడు. నిశ్శబ్ద ఆనంద్ ని ప్రేమిస్తుంది "

"ఎందుకూ?"

"ఎందుకేవిటి.. వాళ్ళకలా బుద్ధి పుట్టింది".

"ఊ"

"నిశ్శబ్ద అమెరికా వెళిపోతుంది."

"నిశ్శబ్దంగానా?.." నాకు తమాషా గా ఉంది.

"అమెరికాలో నిశ్శబ్ద కి డేవిడ్ పరిచయం అవుతాడు"

"వాడెవడు?"

"అన్నీ నేనే చెప్పేస్తే నువ్వురాసేదేవిటి.. ఇదేవన్నా డిక్టేషనుకున్నవా"

"లేదు..చెప్పు"

"కారు ప్రమాదం అవుతుంది"

"అయ్యో"

"ఆనంద్ అమెరికా వస్తాడు"

"హెచ్ వన్ మీదా"

" "

"చెప్పు..చెప్పు.. ఆపేసేవేం..దయాకరెప్పుడు క్రూరంగా చూస్తాడు?.. నిశ్శబ్ద కెవ్వుమని ఎప్పటికైనా అరుస్తుందా?.. "

" "

"చెప్పు"

"ఇహ నేను చెప్పను. నీధోరణి నాకు నచ్చలేదు." అంది.

రక్షించేవనుకోని నేను నిద్రలోకి జారుకున్నాను. నిద్దర్లో నా ఆత్మ కథ నేను రసపరిపూర్ణంగా రాసినట్టు.. దాన్నో ప్రముఖ నిర్మాత సినీమా తీసినట్టు.. అది అఖండ విజయం సాధించి నా కీర్తి ఇనుమడించిపోయి నాకు చేతినిండా ఆఫర్లొచ్చి, ప్రతి ప్రొడ్యూసరుకీ నేనో కథ విచక్షణ లేకుండా కన్నట్టూ, నా ఆత్మ నాకు మంత్రసానై నట్టు, నాకు ముసలాలు పుడుతున్నట్టు, ర్నానూ కాన్పులు కష్టవవుతున్నట్టు.. ఇలా ఏదేదో.. కలొచ్చింది. వేళా పాళా లేకుండా కునికితే ఇంకేవిటవుతుంది మరి?

---